ప్రజాశక్తి

బుధవారం 25 అక్టోబర్ 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి



రియల్ మందగమనం

◆ విశాఖలో అమ్మకానికి నోచని హౌసింగ్ స్టాక్ 10 వేలకు పైమాటే

◆ వెంటాడుతున్న ఆర్థిక సంక్షోభ ఛాయలు ◆ తోడైన ఉపాధి రహిత విధానాల ప్రభావం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖలో రియల్ ఎస్టేట్ మార్కెట్ మందగించింది. ప్రపంచంలో ఆర్థిక సంక్షోభ ఛాయలు, కోవిడ్-19 అనంతర పరిస్థితులే దీనికి ప్రధాన కారణమని తెలుస్తోంది. అమ్మకం కాని హౌసింగ్ స్టాక్ మన దేశంలోని ఏడు ప్రధాన నగరాలైన బెంగళూరు, ముంబయి, చెన్నయ్, హైదరాబాద్, కోల్‌కతా, భువనేశ్వర్, విశాఖపట్నం వంటి చోట్ల ఉంది. ప్రాజెక్టులు లాంచింగ్ జరుగుతున్నా నెక్ అండ్ నెక్ సేల్స్ దిశగానే మార్కెట్ కొనసాగుతోంది. పెద్ద ఎత్తున వెంచర్ల లాంచింగ్ జరుగుతున్నా, రెసిడెన్షియల్ రియల్ ఎస్టేట్‌ను ఆర్థిక మాంద్యం పాతాళంలోకి నెట్టేస్తుందన్నది స్పష్టమవుతోంది.

దీనిపై విశాఖపట్నానికి చెందిన రియల్ ఎస్టేట్ ప్రతినిధులు స్పందిస్తూ '10 వేల వెంచర్లు (ఫ్లాట్స్) వరకూ విశాఖ నగరం, మధురవాడ, ఎండాడ, తగరపువలస, భీమునిపట్నం వంటి చోట్ల సిద్ధంగా ఉన్నా అమ్మకాలు జరగడం లేదు. ఉపాధి లేకపోవడం, ఆదాయ వృద్ధి లేమి కారణాలుగా ఉన్నాయి' అని పేర్కొంటున్నారు. హౌస్ ఫ్లాట్ల అమ్మకం విషయంలో బిల్డర్ భూ సేకరణ, బిల్డింగ్ మెటీరియల్ వ్యయాభారంతో నలిగిపోతున్నాడని చెబుతున్నారు. విశాఖకు ఎపి రాజధాని అంటూ జరిగిన ప్రచారం కూడా పెద్దగా రియల్ రంగంపై ప్రభావం చూపలేదన్న వాదన వినిపిస్తోంది. ఎపి కేపిటల్ వ్యవహారం కోర్టు పరిధిలో ఉండడంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్యాంపు ఆఫీసు కోసం యత్నాలు సాగుతున్నాయి. దసరా నుంచి డిసెంబరుకు సిఎం మకాం మార్పు అంశం వెళ్లిపోయింది. అయినప్పటికీ నిర్మాణాలు చకచకా సాగుతున్నాయి. రియల్‌పై ఈ ప్రభావం ఈ ఏడాది చివరికైనా సానుకూలంగా ఉంటే 'హౌసింగ్ స్టాక్ క్లియర్' అవుతుందని రియల్ మదుపరులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఒకేచోట వందల సంఖ్యలో అపార్టుమెంట్లు

విశాఖ నగరం, చుట్టుపక్కల ప్రాంతాల్లో 'బల్క్ ఇన్వెంటరీ' అత్యధిక అపార్టుమెంట్‌లు ఈ కాలంలో వెలుస్తున్నాయి. నగరం మౌలిక వసతుల విషయంలో పూర్తిస్థాయిలో సాంకేతికతలను అందిపుచ్చుకోవడంలో వైఫల్యాలున్నా వెంచర్లకు మాత్రం వెనుకాడడం లేదు. ఎన్‌ఆర్‌ఐలు, పెద్ద పెద్ద ఉద్యోగాలు చేసి రిటైర్ అయిన వారు, ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన వారు, రాజకీయ నాయకులు ఈ ఫ్లాట్ల కొనుగోలులో కీలకపాత్ర పోషిస్తున్నారు. విశాఖ నగరంలో మిగతా 2లో..

27న విశాఖలో..

పట్టణ సంస్కరణలపై రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పట్టణ సంస్కరణలపై ఈ నెల 27న విశాఖపట్నంలో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. సదస్సులో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజ శర్మ, విజయవాడ టాక్స్ పేయర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎంవి.ఆంజనేయులు, సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిపిఎం జివిఎంసి ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు ప్రసంగిస్తారని తెలిపారు. పట్టణ సంస్కరణల పేరుతో కేంద్ర, రాష్ట్ర మిగతా 2లో..

తీరంలో జన సందడి




విశాఖ తీరానికి మంగళవారం జనం పోటెత్తారు. దసరా నేపథ్యంలో కుటుంబ సమేతంగా ఆర్‌కె బీచ్‌కు తరలివచ్చి సముద్ర స్నానాలు చేశారు. సందడి సందడిగా గడిపారు. ఒకేసారి తండోపతండాలుగా తరలిరావడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది.

డిసెంబర్ 23 నుంచి క్రెడాయ్ ఎక్స్‌పో

▶ వార్త 2లో..

ఆకాశానికేసి అన్నదాత చూపులు

▶ వార్త 8లో..



జగదీప్ ధన్కర్

28న విశాఖకు ఉపరాష్ట్రపతి

రోజంతా బిజీబిజీ

▶ వార్త 2లో..

ఎఎంసి సెంటినరీ ఉత్సవాలకు సర్వం సిద్ధం

27 నుంచి వేడుకలు ప్రారంభం



మాట్లాడుతున్న డాక్టర్ రవిరాజు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రఖ్యాతిగాంచిన ఆంధ్ర మెడికల్ కాలేజీ (ఎఎంసి) సెంటినరీ ఉత్సవాలను ఈ నెల 27, 28, 29 తేదీలలో ఘనంగా నిర్వహించనున్నట్లు ఆంధ్ర మెడికల్ కాలేజ్ సెంటినరీ ఉత్సవాల కమిటీ ఛైర్మన్ డాక్టర్ టి.రవిరాజ్ తెలిపారు. మంగళవారం ఎఎంసిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన అందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఆంధ్ర మెడికల్ కాలేజీ 1923 జూలై 19న ప్రారంభమైందని, 2023 నాటికి వందేళ్లు పూర్తి చేసుకుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎఎంసి అసోసియేషన్ ఆధ్వర్యంలో సెంటినరీ ఉత్సవాలు చేయాలని నిర్ణయించామని తెలిపారు. దేశంలోనే అతి పురాతనమైన వైద్య కళాశాలలో ఒకటైన ఆంధ్ర మెడికల్ కాలేజీ వందేళ్ల ఉత్సవాలలో భాగంగా మూడు రోజులపాటు కార్యక్రమాలు జరుగుతాయన్నారు. దేశ ఉప రాష్ట్రపతితో పాటు రాష్ట్ర గవర్నర్, మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

రియల్ మందగమనం

డబుల్ బెడ్‌రూమ్, త్రిబుల్ బెడ్ రూమ్ ఫ్లాట్ల విషయానికొస్తే రాబోయే 20 ఏళ్లకు తగిన ధరలను నిర్ణయించేసి పెద్ద పెద్ద బిల్డర్లుగా చెప్పుకునే వారు సేల్స్ పెట్టారన్న విమర్శలు కస్టమర్ల నుంచి వినిపిస్తున్నాయి. ఈ విషయంపై క్రెడాయ్ ప్రతినిధి శ్రీనివాసరావు మాట్లాడుతూ చిన్న చిన్న బిల్డర్లంతా ఇళ్లను అమ్ముకోడానికి నానా అవస్థలు పడాల్సి వస్తోందని, అనేక సందర్భాల్లో నష్టాలకే వదిలేస్తున్నారని చెబుతున్నారు. మరోవైపు ఉపాధి అవకాశాలు అంతకంతకూ కుచించుకుపోతున్నాయి. అర్బన్ నిరుద్యోగిత 6.8 శాతం నుంచి 6.6 శాతానికి తగ్గినట్లు కేంద్ర గణాంకాల మంత్రిత్వ శాఖ ఇటీవల వెల్లడించింది. అదే నిజమైతే రియల్ ఎస్టేట్ రంగానికి ఎంతోకొంత ఊపు వచ్చి ఉండేది.

రెసిడెన్షియల్ రియల్ ఎస్టేట్ బల్క్‌గా పెరుగుతున్నప్పటికీ వేల సంఖ్యలో ఇళ్లు అమ్ముడుపోవడం లేదన్నది వాస్తవం. విశాఖ వంటిచోట్ల ఎంవివి బిల్డర్స్, ఎంకె గోల్డ్ వంటి వారు భారీ సంఖ్యలో వెంచర్లు వేస్తున్నారు. వీరి వెంచర్లకు స్పందన ఉన్నప్పటికీ మొత్తంగా రియల్ మార్కెట్ స్లో డౌన్ వల్ల తలెత్తిన ప్రభావం వీరి వెంచర్లపైనా ఉంది.

27న విశాఖలో..
పట్టణ సంస్కరణలపై రాష్ట్ర సదస్సు

ప్రభుత్వాలు సామాన్య, మధ్య తరగతి ప్రజలపై పెను భారాలు వేస్తున్నాయని జగ్గునాయుడు గుర్తుచేశారు. యూజర్ ఛార్జీల పేరుతో ప్రజల కనీస అవసరాలకు రుసుములు వసూలు చేస్తున్నాయని, ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనలో విఫలమవుతున్నాయని విమర్శించారు. ప్రజలు ఎన్నుకున్న స్థానిక సంస్థలను, ప్రజాప్రతినిధులను ఉత్సవ విగ్రహాలుగా మారుస్తున్నాయన్నారు. సంపన్నులు ఉండే ప్రాంతాల్లో అభివృద్ధిని కేంద్రీకరించి, లక్షలాది మంది నివసిస్తున్న సామాన్య, మధ్యతరగతి కాలనీలు, ఏరియాలు, కొండవాలు ప్రాంతాలు, స్లమ్స్‌లో ఎటువంటి అభివృద్ధి చర్యలూ చేపట్టకుండా వివక్షత చూపిస్తున్నాయన్నారు.

నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, పారిశుధ్య కార్మికులకు పూర్తిస్థాయిలో కార్మిక చట్టాలు అమలు చేయడం లేదన్నారు. పని భారాన్ని పెంచుతున్నారన్నారు. ప్రజల నుంచి ముక్కు పిండి మరీ ఆస్తి పన్ను వసూలు చేస్తున్నారని తెలిపారు. ఉద్యోగులపై వేధింపులు, పనిభారం, నిర్బంధం పెరిగాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రజల సమస్యలే ప్రధాన అజెండాలుగా రాష్ట్రంలో ఉండాలనే సంకల్పంతో సిపిఎం ఈ నెల 27న ఉదయం 10 గంటలకు అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో 'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, సంస్కరణలు – పట్టణ ప్రజలపై దుష్ప్రభావాలు' అన్న అంశంపై రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహిస్తోందన్నారు. విశాఖ నగర ప్రజలు దీనిని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఎంసి సెంటినరీ ఉత్సవాలకు సర్వం సిద్ధం

రాష్ట్ర మంత్రులు పాల్గొంటారని తెలిపారు. 32 మంది వైద్య విద్యార్థులతో మొదలైన ఆంధ్ర వైద్య కళాశాల అంచెలంచెలుగా ఎదిగి 1950 నాటికే సూపర్ స్పెషాలిటీ సేవలు అందించగలిగే స్థాయికి చేరుకుందన్నారు. దేశంలోనే అతి పురాతనమైన వైద్య కళాశాలల్లో ఏడవదని తెలిపారు. ఈ కళాశాలలో చదువుకున్న వారు దేశ, విదేశాల్లో స్థిరపడి వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన ఈ కళాశాల వందేళ్ల ఉత్సవాలలో ఈ నెల 27న కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి పాల్గొంటారని, 28న భారత ఉప రాష్ట్రపతితో పాటు రాష్ట్ర గవర్నర్, రాష్ట్ర మంత్రులు పాల్గొంటారని తెలిపారు. 29న తెలుగు సాహితీ వైభవం కార్యక్రమంతో పాటు రాత్రి మ్యూజికల్ నైట్ ఉంటాయని వెల్లడించారు. ప్రారంభ కార్యక్రమం ఆంధ్ర మెడికల్ కాలేజీలోనే ఉంటుందని, మూడు రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాలు ఆంధ్ర యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్‌లో జరుగుతాయని తెలిపారు. ఆంధ్ర మెడికల్ కాలేజీ వందేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా విద్యార్థులకు ఉపయోగపడేలా ఏదైనా చేయాలని భావించిన అసోసియేషన్ సభ్యులు ప్రభుత్వ సహాయంపై ఆధార పడకుండా ఒక సెంటినరీ భవనాన్ని నిర్మించారని తెలిపారు. అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కాలేజీ పక్కన 1.6 ఎకరాల స్థలాన్ని కేటాయించిందన్నారు. పూర్వ విద్యార్థుల నుంచి సేకరించిన విరాళాలతో దాదాపు రూ.50 కోట్లతో ఈ భవన నిర్మాణం పూర్తి చేశామన్నారు. దీనిని ఉప రాష్ట్రపతి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అంతేకాకుండా ఒక పైలాన్‌ను ఏర్పాటు చేశామన్నారు. దేశ, విదేశాల నుంచి మూడు వేల మంది పూర్వ విద్యార్థులు ఈ ఉత్సవాలకు హాజరౌతున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎంసి ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు, కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్, ఎంసి పూర్వ విద్యార్థులు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

28న విశాఖకు ఉపరాష్ట్రపతి రాక

ప్రజాశక్తి – ఎంవిపి.కాలనీ : భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్, ఆయన భార్య సుదేష్ ధన్కర్ ఈ నెల 28న విశాఖకు రానున్నారు. ఉదయం 8:35 గంటలకు వారు ఢిల్లీ ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి 11:00 గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి 11:10 గంటలకు రోడ్డు మార్గంలో బయలుదేరి 11:30కి ఆంధ్ర మెడికల్ కాలేజీకి చేరుకుంటారు. అక్కడ నిర్వహిస్తున్న ఆంధ్ర మెడికల్ కాలేజ్ శత వసంతాల వేడుకల్లో ముఖ్య అతిథులుగా పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 1:00 గంటకు అక్కడి నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి 1:20 గంటలకు ఐఎన్ఎస్ డేగాకు చేరుకుంటారు. భోజన విరామం అనంతరం మధ్యాహ్నం 2:00 గంటల నుంచి 3:30 గంటల వరకు ఐఎన్ఎస్ డేగాలో ఉపరాష్ట్రపతి పర్యటించనున్నారు. 3:30కి ఐఎన్ఎస్ డేగా నుంచి బయలుదేరి 3:55కి విశాఖ ఎయిర్‌పోర్టుకు వచ్చి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి బయలుదేరి వెళ్తారు.



ఆంధ్రా మెడికల్ కాలేజీ ముఖద్వారం

ఎంసి.. అదరహో..

ప్రఖ్యాతిగాంచిన ఆంధ్ర మెడికల్ కాలేజీ (ఎంసి) సెంటినరీ ఉత్సవాలు ఈ నెల 27, 28, 29 తేదీలలో జరుగనున్న నేపథ్యంలో ఇప్పటికే కళాశాల సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఈ వేడుకలకు దేశ ఉప రాష్ట్రపతితో పాటు రాష్ట్ర గవర్నర్, రాష్ట్ర మంత్రులు కూడా హాజరుకానుండటంతో పకడ్బందీగా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఉత్సవాల సందర్భంగా పూర్వ విద్యార్థుల నుంచి సేకరించిన విరాళాలతో దాదాపు రూ.50 కోట్లతో ఓ భవన నిర్మాణం చేపట్టారు. అందంగా ఓ పైలాన్‌ను తీర్చిదిద్దారు. ఈ వేడుకలకు దేశ, విదేశాల్లో ఉన్న ఎంసి పూర్వ విద్యార్థులు మూడు వేల మంది హాజరుకానున్నట్టు నిర్వాహకులు తెలిపారు.



శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో ఏర్పాటు చేసిన పైలాన్


అందంగా రూపుదిద్దుకున్న కళాకృతి

డిసెంబర్ 23 నుంచి క్రెడాయ్ ఎక్స్‌పో

ప్రజాశక్తి – కలెక్టరేట్ : క్రెడాయ్ విశాఖపట్నం ఛాప్టర్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా నిర్వహిస్తున్న ప్రాపర్టీ ఎక్స్‌పో కార్యక్రమాన్ని ఈ ఏడాది డిసెంబర్ 23, 24, 25 తేదీలలో బీచ్‌రోడ్డులోని గాదిరాజు ప్యాలెస్, కన్వెన్షన్ సెంటర్‌లో తలపెట్టినట్టు క్రెడాయ్ చైర్మన్ కెఎస్ఆర్‌కె.రాజు (సాయి), అధ్యక్షులు వి.ధర్మేందర్, కోశాధికారి వి.శ్రీను తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఇప్పటివరకు 8 ఎక్స్‌పోలను నిర్వహించినట్టు చెప్పారు. కొనుగోలుదారులు, వివిధ నిర్మాణ సంస్థలు తాజా ఈవెంట్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారన్నారు. ఎక్స్‌పో నిర్వహించు సమయంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ సంఖ్య, వ్యాపార లావాదేవీల సంఖ్య పెరుగుతూ ఉండటం ద్వారా దీని ప్రజాదరణ స్పష్టంగా కనిపిస్తోందన్నారు. నిర్మాణ, రియల్ ఎస్టేట్ రంగంలోని వాటాదారులందరినీ ఒకే గొడుగు కిందకు తీసుకురావడం ఈ ఎక్స్‌పో ప్రధాన ఉద్దేశమన్నారు. బిల్డర్లు వారి ప్రాజెక్ట్‌లను ప్రదర్శించడం, కొనుగోలుదారులకు అవగాహన కల్పించడం, అనేక రకాల ఫ్లాట్లు, విల్లాలు, ప్లాట్లు నుంచి తమ కలల ఇంటిని ఆసక్తిగల వారు ఎంపిక చేసుకోవడం ఈ ఎక్స్‌పోలో ఉంటాయన్నారు. ప్రఖ్యాత బిల్డర్లతో పాటు బిల్డింగ్ మెటీరియల్, నిర్మాణ సామగ్రిని తయారు చేసే ప్రఖ్యాత కంపెనీలు ఈ ఎక్స్‌పోలో పాల్గొంటాయన్నారు.

పలు బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ముందుగా ఆమోదించబడిన గృహ రుణాలను ప్రాసెస్ చేయడానికి, వివిధ ఎంపికలను వివరించడానికి పాల్గొంటాయన్నారు. 'ఆన్ ది స్పాట్ బుకింగ్స్' కోసం ప్రోత్సాహకాలు, ప్రత్యేక డీల్స్ ఉంటాయన్నారు. 80కిపైగా ఎగ్జిబిటర్లు పాల్గొంటారని తెలిపారు. ఇది ఆంధ్రప్రదేశ్‌లో అతిపెద్ద ఎక్స్‌పోనని పేర్కొన్నారు. విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం జిల్లాల్లో అమలులో ఉన్న ప్రాజెక్టులు, వాటిలో లభించు ధరలను ప్రదర్శనలో ఉంచుతామన్నారు. లక్కీడ్రా నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

మాంసం దుకాణం వద్ద జనం



దసరా పండగ నేపథ్యంలో విశాఖ నగరంలోని మాంసం దుకాణాలు, వైన్‌షాపులు మంగళవారం కిటకిటలాడాయి. వాటి వద్ద ఎక్కడ చూసినా జనం గుమిగూడి కనిపించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అధికార పార్టీ నాయకులు దక్షిణ నియోజకవర్గంలో కోళ్లు, మందు బాటిళ్లు పంపిణీ చేశారు.


వైన్‌షాప్ వద్ద మందుబాబులు

నాడు కళ కళ.. నేడు వెల వెల...

జ్యూట్ కార్మికవాడలో కానరాని దసరా సందడి

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస జ్యూట్ కార్మికవాడలో దసరా పండగ సందడి మచ్చుకు కూడా కాన రాలేదు. పాలకుల పుణ్యమా అని చిట్టివలస జ్యూట్ మిల్లు 2009 ఏప్రిల్ 20న శాశ్వతంగా మూత పడింది. దీంతో చిట్టివలస జ్యూట్ మిల్లు కార్మికులకు 14 ఏళ్లుగా పండగలన్నీ పస్తులతోనే జరుగుతున్నాయని పలువురు కార్మికులు, వారి కుటుంబాలు ఆవేదన వ్యక్తంజేస్తున్నాయి. జ్యూట్ మిల్లు తిరిగేటప్పుడు వచ్చిన వేతనం, బోనస్‌తో పండగలు ఆనందంగా జరుపుకునే వారు. చుట్టాలు, స్నేహితులతో కార్మిక వాడ సందడిగా ఉండేది. మిల్లు మూత పడి 14 ఏళ్ళు దాటింది. ఆనాటి నుంచి దసరా, సంక్రాంతి పండగలు, సంప్రదాయం ప్రకారం ఏదో అలా జరుపుకుంటున్నాం తప్పితే.. ఆనందం లేదని కార్మిక కుటుంబాలు ఆవేదనతో చెప్పాయి. మిల్లు తిరిగే సమయంలో ఇక్కడి క్వార్టర్లలో సుమారు 500 కుటుంబాలు ఉండేవి. మిల్లు మూత పడ్డాక దాదాపు 400 మంది కార్మికులకు యాజమాన్యం బకాయిలు చెల్లించడంతో వారంతా క్వార్టర్లు ఖాళీ చేశారు. ఇంకా చాలా కుటుంబాలు మిగిలాయి. ఏళ్ల తరబడి ఇక్కడనే చాలీ చాలని క్వార్టర్లలో ఉంటున్నారు. బరువెక్కిన హృదయంతో బయటకు వెళ్లిన కుటుంబాలు కూడా ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నాయి.

మిల్లు తిరిగే సమయంలో వేతనం ఎంత అనే కంటే, నెలకు వేతనం వస్తుందన్న భరోసా ఉండేది. ఇప్పుడేమో ఉపాధి ఎక్కడ దొరుకుతుంది? దొరికే ఉపాధి ఎన్ని రోజులు అనేది గ్యారంటీ లేదు. క్వార్టర్లలో ఉండే కుటుంబాలే కాదు.. బయట ఉన్న జ్యూట్ కార్మిక కుటుంబాల పరిస్థితి కూడా ఇందుకు భిన్నమేమీ కాదు.



కళ తప్పిన జ్యూట్ కార్మిక వాడ

ఓ అగ్గి పెట్టెలా, అసౌకర్యాలతో ఉన్న క్వార్టర్‌లోనే పండగ పబ్బాలు సరదాగా జరుపుకునే వారు. చుట్టాలు, స్నేహితులు రాకపోకలతో కాలనీ కళ కళ లాడేది. ఇప్పుడా పరిస్థితి లేదు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి-గాజువాక : గాజువాకలో సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పాత గాజువాకకు చెందిన పల్లా సింహాచలం (రాజు) (43) దుర్మరణం చెందాడు. పాత గాజువాక నుంచి బిహెచ్‌పివి వైపు సింహాచలం, అతని స్నేహితుడు జనార్ధన కలిసి వెళ్తున్నారు. వీరి వాహనాన్ని హెరిటేజ్ పాలు లారీ ఢీకొట్టడంతో రోడ్డు మీద పడి సింహాచలం దుర్మరణం చెందాడు. సింహాచలానికి భార్య, ఎనిమిదేళ్ల కుమార్తె ఉన్నారు.

19 మంది జూదరులు అరెస్ట్

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : మద్దిలపాలెం చైతన్య నగర్‌లో ఉన్న హ్యాపీ సర్వీస్ అతిథి గృహంలో జూదం ఆడుతున్న 19 మందిని ఎంవిపి పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ హెచ్.మల్లేశ్వరరావు అరెస్టు చేశారు. ముందుగా అందిన సమాచారం మేరకు ఎంవిపి పోలీసులు దాడులు నిర్వహించారు. 19 మందిని అరెస్టుచేసి, వారి నుంచి రూ.74,790 నగదు, 17 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి ఎస్ఐ ఎం.శ్రీను దర్యాప్తు చేపట్టారు.



సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొండబాబు

సామాజిక భవనం ప్రారంభం

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు పెద ఉప్పాడలో రూ.10 లక్షలతో నిర్మించిన సామాజిక భవనాన్ని వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు మంగళ వారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

ఘనంగా బద్రీనాథ్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -ములగాడ : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ట్రేడ్ యూనియన్ మూడు జిల్లాల కో-ఆర్డినేటర్ కలిదిండి బద్రీనాథ్ జన్మదిన వేడుకలను పారిశ్రామిక ప్రాంత వైసిపి కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ హాజరై కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కలిదిండి బద్రీనాథ్ ఇటువంటి జన్మదిన వేడుకలు ఎన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైసిపి కార్పొరేటర్లు బల్ల లక్ష్మణరావు, పుర్రె పూర్ణశ్రీ, వార్డు అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్, నాయకులు పిల్ల కన్నబాబు, అంగర రాంప్రసాద్, తోనంగి వెంకటరమణి, మల్ల ధనలత, కొల్లి నూకరెడ్డి పాల్గొన్నారు.



జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఆనంద్‌కుమార్

రోడ్ల అభివృద్ధి అంచనాతోనే సరి

ప్రతిపాదన చేసి మూడు నెలలు గడుస్తున్నా మొదలుకాని పనులు



ప్రతిపాదనలకే పరిమితమైన రహదారి

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలంలోని లోడగలవానిపాలెం పంచాయతీ శ్రమజీవుల కాలనీ బాలికల వసతి గృహానికి వెళ్లే మార్గంలో శిథిలమైన రోడ్డును మండల ఇంజినీరింగ్ అధికారి వెంకటేశ్వర్లు మూడు నెలల క్రితం పరిశీలించారు. రోడ్డు పొడవు, వెడల్పులు కొలతలు వేసి, నిర్మాణానికి అవసరమైన అంచనా ప్రతిపాదనలు రూపొందించారు. ఇది జరిగి మూడు నెలలు గడుస్తున్నా నేటికీ పనులు ప్రారంభం కాలేదు. రోడ్డు పనులు ప్రారంభిస్తామని గత సర్వసభ్య సమావేశంలో తెలియజేసినప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. మండల కార్యాలయానికి కూత వేటు దూరంలో ఉన్న రోడ్డు గత కొన్ని సంవత్సరాలుగా అధ్వానస్థితిలో ఉండటాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు చూస్తున్నా నివారణ చర్యలు చేపట్టకపోవడం బాధాకరం. దసరా సెలవులు ముగుస్తుండటంతో విద్యార్థినులు వసతి గృహాలకు చేరుకొని ప్రతిరోజు ఈ రోడ్డు ద్వారానే పాఠశాలకు వెళ్లాల్సి ఉంది. ఇప్పటికైనా రోడ్డు ఏర్పాటుచేయాలని పలువురు కోరుతున్నారు.

అవస్థలు పడుతున్నాం

శ్రమజీవుల కాలనీలో రోడ్డు, డ్రెయినేజీలు అధ్వాంగా ఉన్నాయి. రోడ్డు వెళ్లి, వచ్చేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నాం. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు స్పందించి రోడ్డును బాగుచేసేందుకు చర్యలు చేపట్టాలి.

కె.నాగరాణి
స్థానిక మహిళ

అధ్వానంగా దొంతల వారి కల్లాలు రోడ్డు

ప్రజాశక్తి-ఆనందపురం : మండలంలోని ఆనందపురం పంచాయతీ పరిధి దొంతలవారి కల్లాలు రోడ్డు పూర్తి అధ్వాన స్థితిలో ఉంది. సుమారు అర కిలోమీటర్ మేర రోడ్డు పాడైనా అధికారులు, నాయకులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో రోడ్డు ఏర్పాటుకు మెటల్ వేసినా కాంట్రాక్టర్ మృతిచెందడంతో ఆ పనులు మధ్యలోనే ఆపివేశారు. 500 మీటర్లు ఉంటున్న రోడ్డును 5 సంవత్సరాలుగా పనులు చేపట్టకుండా వదిలివేయడంతో శిథిలావస్థకు చేరుకుంది. ఇటీవల స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానికులు ఈ రోడ్డుకు సంబంధించి వినతి పత్రం అందించారు. అయినా ఇప్పటి వరకు స్పందన లేదు. ఇప్పటికైనా నాయకులు, అధికారులు చొరవ తీసుకొని ఈ రోడ్డు బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



మెటల్ వేసి విడిచిపెట్టిన దొంతలవారి కల్లాల రోడ్డు



టోర్నమెంట్ విజేతలు వీరే

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో దసరా సందర్భంగా ఇటీవల ప్రారంభమైన హెచ్‌సిఎల్ క్రికెట్ టోర్నమెంట్ మంగళవారంతో ముగిసింది. మూడు జట్లు పాల్గొనగా టైటాన్ జట్టు విన్నర్‌గా నిలిచింది. విన్నర్ జట్టు రూ.3వేలు, రన్నర్‌గా రెడ్ బుల్స్‌జట్టు నిలిచి రూ.2వేలు నగదు బహుమతి గెలుచుకున్నట్లు టోర్నమెంట్ నిర్వాహకులు వెల్లడించారు. పాఠశాల హెచ్ఎం పొట్నూరు మురళీ మోహన్‌రావు, విశ్రాంత ఉద్యోగి పిట్ట త్రినాధ్, వెంపాడ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు వి.శ్రీనివాసరెడ్డి ద్వారా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎ.లోవరాజు, ప్రతాప్, కిషోర్, హరి తదితరులు పాల్గొన్నారు.

రాకేష్‌రెడ్డికి స్వాగతం

ప్రజాశక్తి -గాజువాక : పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్, ఉత్తరాంధ్ర కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పి.రాకేష్ రెడ్డి విశాఖ పర్యటనకు వచ్చిన సందర్భంగా విమానాశ్రయంలో గాజువాక కాంగ్రెస్ నాయకులు స్వాగతం పలికారు. శాలువ కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన్ను కలిసిన వారిలో గాజువాక కాంగ్రెస్ పార్టీ సమన్వయ కర్త జెర్రిపోతుల ముత్యాలు, లక్కరాజు రామారావు, వజ్రపతి శ్రీనివాస్, వేగి వెంకటేష్, జగన్ ఉన్నారు.

రోడ్డుపైనే వ్యాపారాలు

ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం
చోద్యం చూస్తున్న పోలీసులు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం వేములవలస పూల మార్కెట్‌లో వ్యాపారం భారీగా జరుగుతుంటుంది. మార్కెట్లో జరగాల్సిన వ్యాపారం రోడ్డుపైనే నిర్వహిస్తుండడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటోంది. ఆనందపురం కూడలికి చేరుకోవాలంటే పూల మార్కెట్ ద్వారానే ప్రయాణించాల్సి ఉంది. తెల్లవారుజాము నాలుగు గంటల నుంచి 11 గంటల వరకు ఈ రోడ్డు ద్వారా వెళ్లాలంటే అవస్థలు పడాల్సిందే. నివారణ చర్యలు చేపట్టవలసిన పోలీస్ శాఖ చోద్యం చూస్తోంది. వందలాది వాహనాలు, విద్యార్థులు వ్యాపారస్తులు, ప్రయాణికులు ఈ రోడ్డు ద్వారానే వేములవలస కూడలికి చేరుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. విశాఖపట్నం నుంచి వచ్చే వాహనాలను వంతెనల కింద నుంచి మళ్లించడంతో బీపీ కల్లాలు రోడ్డు నుంచి వాహనాలు ఎలా వెళ్లాలో తెలియక పలు ఇబ్బందులు పడుతున్నారు. వేములవలస పూల మార్కెట్ రోడ్డుపై వ్యాపారాలు నివారించి వాహనదారులకు, ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా స్థానిక పోలీసులు నివారణ చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.



రోడ్డుపై వ్యాపారాలు చేయడంతో నిలిచిపోతున్న వాహనాలు

డిఆర్‌ఎం ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : దమన్‌జోడి, లక్ష్మీపూర్ రోడ్ రైల్వేస్టేషన్లలో వివిధ మౌలిక సదుపాయాల అభివృద్ధి, విభాగంలో భద్రతా అంశాలను వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ తనిఖీ చేశారు. సీనియర్ అధికారులతో కలిసి దమన్‌జోడి స్టేషన్‌ను డిఆర్‌ఎం పరిశీలించి అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ప్రయాణికుల సౌకర్యాలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, సర్క్యులేటింగ్ ఏరియా, స్టేషన్ బిల్డింగ్ అభివృద్ధిని సమీక్షించారు. అనంతరం డివిజనల్, కన్‌స్ట్రక్షన్ అధికారులతో కలిసి దమంజోడి - బైగూడ సెక్షన్ యార్డులో డబ్లింగ్ పనులను పరిశీలించారు. ట్రాక్ స్లీవింగ్ ద్వారా ట్రాక్ లే-అవుట్‌ను సవరించడం, క్రాస్-ఓవర్‌ను మార్చడం, ఓవర్ హెడ్ ఎక్విప్‌మెంట్ ఎలక్ట్రికల్ మాస్ట్‌లను మార్చడం ద్వారా వేగాన్ని పెంచడానికి ప్రణాళికాబద్ధమైన పనులను సమీక్షించారు. లక్ష్మీపూర్ రోడ్ స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యాలు, విశాలమైన ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, సర్క్యులేటింగ్ ఏరియా, అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ కింద కొత్త స్టేషన్ ఎంట్రీ, ఎగ్జిట్‌ల అప్‌గ్రేడేషన్‌ను సమీక్షించారు. చివరిగా పార్వతీపురం సమీపం లోని లెవల్ క్రాసింగ్ నెంబర్ 288 వద్ద భద్రత, కార్యాచరణ అంశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గేట్‌మాన్‌తో మాట్లాడి సమస్యలనడిగి తెలుసుకున్నారు. సెక్షన్‌లో భద్రతాపరమైన అంశాలను పరిశీలించేందుకు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు డిఆర్‌ఎం తెలిపారు. ఈ తనిఖీలలో ఎడిఆర్‌ఎం (ఇన్‌ఫ్రా) సుధీర్ కుమార్‌గుప్తా, సివిల్ ఇంజినీరింగ్ కన్‌స్ట్రక్షన్‌కు చెందిన సీనియర్ డివిజనల్ ఇంజినీర్లు పాల్గొన్నారు.


రైల్వే లైన్లను పరిశీలిస్తున్న డిఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్


బ్రోచర్‌ను విడుదల చేస్తున్న స్టీల్ సిఎమ్‌డి అతుల్‌భట్ తదితరులు

గ్రీన్‌సిటీలో వైజాగ్ ప్రొఫైల్స్ డివిజనల్ కార్యాలయం

ప్రజాశక్తి -గాజువాక : కెనడా సౌజన్యంతో వైజాగ్ ప్రొఫైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ గ్రీన్ సిటీలో ఏర్పాటుచేసిన ఇంటర్నేషనల్ బిజినెస్ డివిజనల్ కార్యాలయాన్ని స్టీల్‌ప్లాంట్ సిఎమ్‌డి అతుల్‌భట్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అతుల్ భట్ మాట్లాడుతూ, ప్రపంచంలో వైజాగ్ స్టీల్‌కు ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. ఈ మేరకు వైజాగ్ ప్రొఫైల్స్ ఎమ్డీ బండి సురేష్‌కుమార్, డైరెక్టర్ వివి.కృష్ణారావును అభినందించారు. సుమారుగా రూ.10 వేల కోట్లు ఎగుమతులు చేస్తున్న వైజాగ్ ప్రొఫైల్స్ ఆలోచనలు గొప్పవన్నారు. అనంతరం బ్రోచర్‌ను విడుదలచేశారు. ఈ కార్యక్రమంలో రమేష్, చిన్న సురేష్, సృజన్, హర్ష, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


బతుకమ్మ సంబరాల్లో మహిళలు

ఘనంగా బతుకమ్మ సంబరాలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన ఉక్కునగరం సీ భవన్‌లో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఉక్కు చీఫ్ జనరల్ మేనేజర్ (వర్క్స్) ఇంఛార్జి ఎన్‌వి.స్వామి, డబ్లుఎండి, ఎస్‌ఎంఎస్ -1 విభాగాధిపతులు కె.రవిశేఖర్, పి.శ్రీనివాసరావు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం అతిథులు మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడే విధంగా బతుకమ్మ సంబరాలు జరపడం హర్షణీయం అన్నారు. మహిళలు బతుకమ్మ పాటలతో ఆడి పాడి సందడి చేశారు. రంగు రంగు పూలతో అలంకరించిన బతుకమ్మలను పేర్చి పాటలు పాడుతూ సందడి చేయడం ఆహుతులను ఆకట్టుకుంది. సంఘం అధ్యక్షులు ఎన్.కుమారస్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జి.ఆనంద్, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.వెంకటేశ్వర్లు, ప్రతినిధులు జి.మల్లేశం, ఎన్.నర్సింగరావు, టి.ప్రభాకర్, సిహెచ్.రవికుమార్, ఆర్.నర్సింహా, బానోత్ గణేష్, జె.శ్రవణ్‌కుమార్, అధికారులు ఎన్.వీరేశం, పి.శంకర్, ఎ.శంకర్ తదితరులు పాల్గొన్నారు.


జర్నలిస్టులకు మాంసం, మిఠాయిలు అందిస్తున్న అదీప్‌రాజు, కాశీ విశ్వనాథ్‌రాజు

టిజెఎఫ్ దసరా సంబరాలు

ప్రజాశక్తి-సీతమ్మధార : తెలుగు జర్నలిస్ట్స్ ఫోరం (టిజెఎఫ్) అసోసియేషన్ ఆధ్వర్యాన నగరంలో ఒక హోటల్‌లో దసరా సంబరాలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజు, వైసిపి నాయకులు బొడ్డేటి కాశీవిశ్వనాథ్‌రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫోరం అధ్యక్ష కార్యదర్శులు ఎల్‌జి.నాయుడు, ఈశ్వర్ చౌదరి మాట్లాడుతూ, జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే అదీప్ రాజును కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ సమాజ శ్రేయస్సు కోసం నిరంతరం కష్టపడుతూ, ప్రభుత్వానికి, ప్రజలకు వారధిలా పనిచేస్తున్న జర్నలిస్ట్ మిత్రులందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వ పెద్దలతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. అనంతరం అన్నంరెడ్డి అదీప్‌రాజుచే జర్నలిస్టులందరికీ మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు, ఫోరం సభ్యులు పాల్గొన్నారు.

'బ్యాన్ సింగిల్ యూజ్ ప్లాస్టిక్' షార్ట్ ఫిలిం ప్రారంభం


అల్లూరి విజ్ఞాన కేంద్రంలో షార్ట్ ఫిల్మ్ చిత్రీకరణ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం ఆపాలని 'బ్యాన్ సింగిల్ యూజ్ ప్లాస్టిక్' అనే వర్కింగ్ టైటిల్‌తో సందేశాత్మక షార్ట్ ఫిలిం షూటింగ్ అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా షార్ట్ ఫిలిం డైరెక్టర్ ఎల్లాజీ మీడియాతో మాట్లాడుతూ, ప్లాస్టిక్ వాడకం అనేది ప్రమాదకర స్థాయికి చేరిందని, దీనివల్ల అంతుచిక్కని రోగాలకు ప్రజలు గురవుతున్నారని తెలిపారు. ప్లాస్టిక్‌ను బ్యాన్ చేస్తూ ఎన్నోసార్లు ప్రభుత్వాలు ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ ప్రజల్లో మార్పురానంత కాలం ఈ సమస్య కొనసాగుతూనే ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో ప్రజల్ని చైతన్యపరిచే విధంగా వైజాగ్ షార్ట్ ఫిలిం మేకర్స్ అసోసియేషన్ ఈ ఫిలిం రూపొందిస్తుందని తెలిపారు. ఈ షార్ట్ ఫిలిం షూటింగ్ ఒక్క రోజులో పూర్తి చేసుకునే విధంగా తీస్తున్నామని పేర్కొన్నారు. రాబోయే కాలంలో వైజాగ్ షార్ట్ ఫిలిం మేకర్స్ అసోసియేషన్ అల్లూరి విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యాన ఇటువంటి సందేశాత్మక షార్ట్ ఫిలిమ్స్ రూపొందిస్తామని తెలిపారు. దిలీప్, శ్రీను కెమెరామెన్లుగా, మాస్టర్ జిగ్నేష్, రాజు, హుష్ కాకి అప్పారావు, అష్రఫ్ వివిధ పాత్రల్లో నటించారు.

'గ్రామకంఠం ఆక్రమణ అన్యాయం'

ప్రజాశక్తి -ములగాడ : 16 కులాలకు చెందిన మల్కాపురం గ్రామ కంఠం స్థలంలో ఒక వర్గం అక్రమంగా భవన నిర్మాణం చేపట్టడం దుర్మార్గమని మల్కాపురం విజ్ఞాన మండలి యాదవ సంఘం కార్యవర్గ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మల్కాపురం విజ్ఞాన మండలిలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ, మల్కాపురం నగరాల వీధిలో ఉన్న గ్రామ కంఠం స్థలం 16 కులాలకు చెందినదని తెలిపారు. హెచ్‌పిసిఎల్ నిర్మాణం కాకముందు అక్కడ యాదవ, శెట్టిబలిజి, జాలారి, రెడ్డి, ఓడబలిజి, తెలకుల, పల్లీలు, నగరాలు, మాదిగ, మాల, విశ్వబ్రహ్మణ తదితర 16 కులాల వారు వివిధ వృత్తులు చేసుకుంటూ జీవించేవారని పేర్కొన్నారు. హెచ్‌పిసిఎల్ నిర్మాణం కోసం అక్కడ ఉన్న గ్రామాన్ని 1927సంవత్సరంలో ప్రస్తుతం ఉన్న మల్కాపురం ప్రాంతానికి తరలించారని చెప్పారు. అప్పటి గ్రామస్తుల అవసరాలకోసం సుమారు 30 ఎకరాల స్థలాన్ని అప్పుడున్న 16కులాలకు కేటాయించారని వివరించారు. ఈ కేటాయించిన స్థలం మల్కాపురం ప్రకాష్‌నగర్ ప్రాంతంలో కొంత, మల్కాపురం మార్కెట్ సమీపంలో కొంత, మల్కాపురం నగరాల వీధిలో కొంత ఉన్నాయని తెలిపారు. ఈ స్థలాల్లో అమ్మవారి పండగలు, గ్రామ సమావేశాలు నిర్వహణకు ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. పెద్దింటి అమ్మవారి పండగ, పూజల నిర్వహణ తదితర అవసరాల నిమిత్తం ఉంచిన స్థలంలో మిగిలిన కులాలను పక్కన పెట్టి ఒక సామాజిక వర్గం తన అవసరాలకోసం ఎవరిని సంప్రదించకుండా అక్రమంగా భవనం నిర్మాణం చేపట్టడం మిగిలిన కులాలను తక్కువగా చూడడమేనని పేర్కొన్నారు. ఏక చత్రాధిపత్యం వల్ల కులాల మధ్య విభేదాలు వచ్చే అవకాశం ఉందన్నారు. తక్షణమే అక్రమ నిర్మాణం అపాలని, లేకుంటే తాము న్యాయ పోరాటం చేస్తామని స్పష్టంచేశారు.

ఘనంగా హీరో ప్రభాస్ పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ సిటీ వైడ్ ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన మద్దిలపాలెం కిన్నెర - కామేశ్వరి థియేటర్ ఆవరణలో ప్రముఖ హీరో ప్రభాస్ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. వైసిపి ఉత్తర నియోజక వర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు ముఖ్య అతిథిగా హాజరై కేకు కట్ చేశారు. అనంతరం అభిమాన సంఘం నాయకులు మాట్లాడుతూ, త్వరలో రానున్న సలార్, కల్కి బ్లాక్ బస్టర్ హిట్స్ అవుతాయని ఆశా భావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అభిమానులు, థియేటర్ సిబ్బంది పాల్గొన్నారు.


ప్రభాస్ పుట్టిన రోజు వేడుకల్లో అభిమానులు

వైసిపి ప్రభుత్వానికి ఆఖరి దసరా

ప్రజాశక్తి-సీతమ్మధార : వైసిపి ప్రభుత్వానికి ఇదే ఆఖరి దసరా అని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.విష్ణుకుమార్ రాజు పేర్కొన్నారు. గురుద్వారా సమీపంలోని బిజెపి ఉత్తర నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పుంగనూరు ఘటన దురదృష్టకరం అన్నారు. మంత్రి పెద్దిరెడ్డికి చిత్తూరు జిల్లాను ముఖ్యమంత్రి రాసి ఇచ్చేశారా అని ప్రశ్నించారు. ఈ దాడిని ప్రతి పక్షాలు ఖండించాలన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి టిటిడి ఇఒ ప్రియ శిష్యుడు అని, టిటిడి ఆదాయంలో ఒక శాతం తిరుపతి అభివృద్ధికి ప్రతిపాదన చేయడం పెద్ద కుట్ర అన్నారు. బిజెపి, విహెచ్‌పి ఆందోళన నేపథ్యంలో ప్రభుత్వం ఈ ప్రతిపాదనను ఆమోదించలేదన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక రౌడీ షీట్‌లు ఎత్తేశారని తెలిపారు. రాష్ట్రంలో నియంత పాలన సాగుతుందన్నారు. విశాఖలో రాజధాని అంటూ దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు అరెస్టులో బిజెపి పాత్ర ఉందని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ చెప్పడం అవివేకం అన్నారు. లిక్కర్ మాఫియా ద్వారా జగన్మోహన్‌రెడ్డి దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు.

నేడు మల్కాపురంలో జగనన్నకు చెబుదాం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : మండలాల్లో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహణలో భాగంగా బుధవారం ములగాడ మండలంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు మల్కాపురంలోని మరిడిమాంబ కళ్యాణ మండపంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం జరుగుతుందని, జిల్లా అధికారులు, జివిఎంసి అధికారులు హాజరు కావాలని పేర్కొన్నారు. మండల ప్రజలందరూ ఈ కార్యక్రమానికి హాజరై సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం

ప్రజాశక్తి -గాజువాక : రక్తదానం మరొకరికి ప్రాణదానం అని సాహితీ కంప్యూటర్ అధినేత కరణంరెడ్డి నర్సింగరావు పేర్కొన్నారు. గాజువాక లంకా మైదానంలో మణియాదవ్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యాన మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ, మణియాదవ్ మన మధ్య లేకపోయినా కుటుంబ సభ్యులు ఆయన జ్ఞాపకార్థం పలు సేవా కార్యక్రమాలు చేయడం ఆదర్శనీయమన్నారు. రక్త దాతలకు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చట్టి గోపి, గూటూరు శంకరరావు, పల్లా త్రినాథ్, ఎఎస్ఆర్, వినోద్ పాల్గొన్నారు.

ఆందోళనలో అన్నదాతలు

- తీవ్ర వర్షాభావంతో ఎండుతున్న పంటలు
- మరొకవైపు తెగుళ్లు బెడద



వర్షాభావంతో మల్లం గ్రామంలో ఎండిపోయిన వరి పంట

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట

ఒక వైపు తీవ్ర వర్షా భావ పరిస్థితులు, మరో వైపు తెగుళ్ల బెడదతో అన్నదాత తీవ్ర ఆందోళన చెందుతున్నాడు. సకాలంలో వర్షాలు లేక, అరకొరగానే వరినాట్లు వేయగా, తరువాత వరుణుడు ముఖం చాటేయడంతో వేసిన వరి పంట ఎండిపోతుంది. ఇదే సందర్భంలో పంట తెగుళ్ల బారిన పడటంతో రెండు మూడు రోజుల్లోనే రేకులు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు పురుగుల మందుల షాపులకు పరుగులు తీస్తున్నారు.

మండలంలోని వడ్డాది చిన్నప్పన్నపాలెం, దిబ్బిడి, బుచ్చయ్యపేట, కందిపూడి, రాజాం, మల్లం, తురకలపూడి, పెదపూడి, సీతయ్యపేట, గున్నెంపూడి, కేపీ.అగ్రహారం తదితర గ్రామాలలో వరిసాగు చేపడుతున్నారు. గతంలో 6వేల నుండి 7వేల ఎకరాల వరకు వరి సాగు జరిగేది. ఈ ఏడాది వర్షాభావం కారణంగా అరకొరగానే వరి సాగు జరిగింది. వ్యవసాయ శాఖ ఈ క్రాప్ నమోదు ప్రకారం మండలంలో వరి సాగు 4588 ఎకరాల్లో వరినాట్లు పడ్డాయి.

వర్షాభావంతో తీవ్ర నష్టం...

ఈ ఏడాది వరి సాగుకు వర్షాభావ పరిస్థితులు తీరని నష్టాన్ని చేకూర్చాయి. వరినాట్ల సమయంలో సకాలంలో వర్షాలు కురవలేదు. బావులు, వ్యవసాయ మోటార్లతో కొద్ది మేరకు వరినాట్లు వేయగా, సెప్టెంబర్‌లో అడపదడపా కురిసిన వర్షాలకు మరికొంత మేరకు వరి నాట్లు వేశారు. అయితే అక్టోబర్ మొత్తంగా వరుణుడు ముఖం చాటేయడంతో చెరువుల్లో సైతం పూర్తిస్థాయిలో నీరు లేదు. దీంతో రైతులు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో వరి పంటకు సాగు నీరు లేక ఎండిపోతున్నాయి. చెరువుల్లో సైతం నీరు లేకపోవడంతో వరుణుడి కోసం ఎదురుచూస్తున్నారు.

తెగుళ్ల బారిన వరి పంట

ప్రస్తుతం వరి పంట తెగుళ్ల బారిన పడింది.



పురుగుల మందు పిచికారీ చేస్తున్న రైతు

పలు గ్రామాలలో వరి సాగులో ఆకుముడత తెగులు అధికంగా ఉంది. దీంతో రైతుల తీవ్ర ఆందోళన చెందుతూ పురుగుల మందును వరి పంటకు పిచికారీ చేస్తున్నారు. వరి నాట్లు పూర్తయి సుమారు 40 రోజులుగా కావస్తుండగా, ఒక్కొక్క రైతు ఇప్పటికే రెండు నుంచి మూడుసార్లు పురుగుల మందును పిచికారీ చేశారు. ఈ మందుల వల్ల తెగుళ్ల ఉధృతి తగ్గుతుంది తప్ప పూర్తిస్థాయిలో నివారణ జరగటం లేదని రైతులు వాపోతున్నారు. మరో వైపు నీరు లేకపోవడంతో పలు గ్రామాల్లో పురుగుల మందు పిచికారీ చేసిన వరి పంట ఎండిపోతున్నాయి. ఒకవైపు నీరు లేక, మరొకవైపు చీడపీడల ప్రభావంతో రైతులు వరిసాగుపై ఆందోళన చెందుతున్నారు.



ఎస్ఎస్ఎ సిబ్బందికి చెక్కులు అందజేస్తున్న దృశ్యం

ఎస్ఎస్ఎ సిబ్బందికి ఎపిటిఎఫ్ రూ.లక్ష సాయం

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట

గత నాలుగు నెలలుగా ప్రభుత్వం వేతనాలు చెల్లించకపోవడంతో ఇబ్బంది పడుతున్న మండల విద్యాశాఖలోని సర్వ శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న 9 మంది సిబ్బందికి దసరా పండగ పూట పస్తులుండకూదన్న ఉద్దేశంతో ఎపిటిఎఫ్ మండల శాఖ లక్ష రూపాయలు ఆర్థిక సాయం అందజేసింది. ఈ మేరకు మండల విద్యాశాఖ అధికారి బుద్ధ కాశీ చేతుల మీదుగా సోమవారం లక్ష రూపాయలు చెక్కులను ఎపిటిఎఫ్ నాయకులు అందజేశారు. సర్వ శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్, కంప్యూటర్ ఆపరేటర్, పలువురు సిఆర్‌పిలు పనిచేస్తున్నారు. వీరికి గత నాలుగు నెలలుగా ప్రభుత్వం వేతనాలను చెల్లించలేదు. వేతనాలను చెల్లించకపోవడంతో ఎస్ఎస్ఎ సిబ్బంది ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. దసరా పండగ నేపథ్యంలో వేతనాలు లేక వస్తువులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి దుర్గాప్రసాద్, మండల అధ్యక్ష కార్యదర్శులు దేవుడు బాబు, మధు కృష్ణ తదితరులు లక్ష రూపాయలను సమకూర్చి మండల విద్యాశాఖ అధికారి బుద్ధ కాశీ విశ్వేశ్వరరావు చేతుల మీదుగా చెక్‌లను అందజేశారు. పండగ పూట పస్తుల బాధను తమకు తప్పించిన ఏపీటీఎఫ్ ఉపాధ్యాయులకు ఎఎస్ఎ సిబ్బంది కృతజ్ఞతలు తెలియజేశారు.



గృహోపకరణాలు అందజేస్తున్న సూర్యనారాయణ తదితరులు

భవన నిర్మాణ కార్మికులకు గృహోపకరణాలు పంపిణీ

ప్రజాశక్తి-కె.కోటపాడు

విజయదశమి పండుగను పురస్కరించుకొని ప్రతి ఏటా లాగే ఈ సంవత్సరం కూడా శ్రీరావాలమ్మ బిల్డింగ్ కన్స్ట్రక్షన్స్ యజమాని కన్నూరు సూర్యనారాయణ భవన నిర్మాణ కార్మికులు సుమారు 70 మందికి మూడు లక్షల రూపాయల విలువైన గృహోపకరణాలు మంగళవారం పంపిణీ చేశారు. మండలంలోని కింతాడ శివారు కూండ్రపువానిపాలెం జరిగిన కార్యక్రమంలో వంటపాత్రలు, వస్త్రాలు, ఫలహారం, మిటాయి పాకెట్లను శ్రీసత్య సాయి సేవా సంస్థల సేవాదళ్ జిల్లా సమన్వయ కర్త కళిరెడ్డి అప్పలనాయుడు, శ్రీసత్య సాయి భజన మండళ్ల మండల కన్వీనరు కన్నూరు అప్పలనాయుడు చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న కన్నూరు సూర్యనారాయణ సేవలను కళిరెడ్డి అప్పలనాయుడు, కల్లూరు అప్పలనాయుడు కొనియాడారు. సందర్భంగా భవన నిర్మాణ కార్మికులు కన్నూరు సూర్యనారాయణను సాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బోని వెంకటరావు, కన్నూరు చందు, కన్నూరు గౌరీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి-అచ్యుతాపురం

మండలంలోని ఉప్పవరం గ్రామంలో దుర్గాంబికా అమ్మవారి ఆలయ నిర్మాణానికి సోమవారం ప్రజాప్రతినిధులు భూమి పూజ చేశారు. గ్రామస్తుల విరాళాలతో ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకులు కోన బుజ్జి, మల్లవరం గ్రామ సర్పంచ్ పి వాసు రాజు, మాజీ గ్రామ సర్పంచ్ చిన్ని శ్రీనివాసరావు, గ్రామ ఉపసర్పంచ్ కూనిశెట్టి సత్తిబాబు, రావి శోభన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

పలు చోట్ల 'జగనాసుర' దహనం

ప్రజాశక్తి- సబ్బవరం

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పిలుపు మేరకు 'దేశం చేస్తుంది రావణ దహనం - మనం చేద్దాం జగనాసుర దహనం' అనే కార్యక్రమం జిల్లాలోని పలు చోట్ల టిడిపి శ్రేణులు నిర్వహించారు. ఇందులో భాగంగా సబ్బవరం మండలంలోని మొగలిపురం గ్రామంలో మనం చేద్దాం జగనాసుర దహనం కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు చేపట్టారు. ఈ సందర్భంగా సైకో పోవాలి-సైకిల్ రావాలి అంటూ నినాదాలు చేశారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ తమరాన సన్యాసమ్మ బంగారు నాయుడు, మాజీ సర్పంచ్ బైలపూడి సత్యం, టీడీపీ గ్రామ అధ్యక్షుడు అంగటి నాని, గోటివాడ అప్పారావు, గండి నరేష్, శ్రీరాములు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



నాగజగదీష్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

దేవరాపల్లి : టిడిపి రాష్ట్ర కమిటీ ఆదేశాలు మేరకు దేశం చేస్తుంది రావణ దహనం - మనం చేద్దాం జగనాసుర దహనం అనే కార్యక్రమం సోమవారం రాత్రి మండలంలోని కాశీపురం గ్రామంలో నిర్వహించారు. టిడిపి మండల అధ్యక్షుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ ఆధ్వర్యంలో సైకో పోవాలి అనే నినాదంతో ఉన్న పత్రాలను మంటలలో వేసి దహనం చేశారు. మంగళవారం రాత్రి సీతంపేట గ్రామంలో టిడిపి మాడుగుల నియోజకవర్గం ఇన్‌ఛార్జి పివిజి కుమార్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు.

కాగడాలతో నిరసన

అచ్యుతాపురం : చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా సోమవారం రాత్రి టిడిపి ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అచ్యుతాపురంలో కాగడాలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

నాగజగదీష్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు

అనకాపల్లి : జగనాసుర దహనం కార్యక్రమం నేపథ్యంలో టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావును ఆయన స్వగృహం వద్ద పోలీసులు నోటీసు ఇచ్చి అదుపులోకి తీసుకొని టౌన్ పోలీస్ స్టేషన్‌కి తరలించారు. ఈసందర్భంగా నాగజగదీష్ మాట్లాడుతూ టిడిపి శ్రేణులకు భయపడి పిరికిపందలా ముఖ్యమంత్రి జగన్ రెడ్డి హౌస్ అరెస్టులకు పాల్పడ్డారని ఆరోపించారు. ప్రతిపక్ష పార్టీలను చూసి ముఖ్యమంత్రి జగన్ రెడ్డికి నిద్ర పట్టడం లేదన్నారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ప్రజల మధ్యనే ఉంటూ వైసిపి ప్రభుత్వంపై పోరాటం చేస్తామన్నారు.



పివిజి.కుమార్ ఆధ్వర్యాన నిరసన తెలుపుతున్న టిడిపి కార్యకర్తలు

లుక్స్ గ్లో సెలూన్ ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి పట్టణంలో మరో కొత్త సెలూన్ మంగళవారం ప్రారంభమైంది. విజయదశమి సందర్భంగా రింగురోడ్డులోని సుబ్రహ్మణ్య ప్యాలెస్ వద్ద 'లుక్స్ గ్లో యునిసెక్స్ ఫ్యామిలీ సెలూన్' పేరుతో ఏర్పాటు చేసిన సెలూన్‌ను వైసిపి అనకాపల్లి పార్లమెంటరీ పరిశీలకులు దాడి రత్నాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా దాడి రత్నాకర్‌న యజమాన్యం సత్కరించింది. రత్నాకర్ సెలూన్ అంతా కలియదిరిగారు. ఈ సందర్భంగా యాజమాన్యాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ దసరా నాడు ప్రారంభించిన సెలూన్ దినదినాభివృద్ధి చెంది వ్యాపారం విజయవంతంగా నడవాలని ఆకాంక్షించారు.

శివపార్వతుల విగ్రహాల ఏర్పాటుకు భూమి పూజ

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

మండలంలోని కోమల్లపూడిలో నూతనంగా శివపార్వతుల విగ్రహాలు ఏర్పాటుకు విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం భూమి పూజ ఘనంగా నిర్వహించారు. సుమారు 20 లక్షల రూపాయలతో మండపం, ర్యాంపు, విగ్రహాల నిర్మాణానికి పనుల ప్రారంభించారు. తుమ్మపాలకు చెందిన దాత బుదిరెడ్డి దేవుడుబాబు దంపతులు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా దాతలు బుదిరెడ్డి దేముడు బాబు దంపతులను విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. అనంతరం విశాఖ డెయిరీ గేదెల సత్యనారాయణ మాట్లాడుతూ కోమాల్లపూడిలో ఆధ్యాత్మిక, వాతావరణం కల్పించడానికి ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



విగ్రహాల దాత దేవుడుబాబు దంపతులను సన్మానిస్తున్న దృశ్యం



కొత్తగా నిర్మిస్తున్న రామాలయాన్ని ప్రారంభిస్తున్న రత్నాకర్

విగ్రహాల ఏర్పాటుకు విరాళం

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని పరవాడపాలెంలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయంలో విగ్రహాలను సమకూర్చుతానని వైసిపి అనకాపల్లి పార్లమెంటరీ పరిశీలకులు దాడి రత్నాకర్ అన్నారు. సోమవారం రత్నాకర్ పరవాడపాలెంలో కనక దుర్గమ్మను దర్శించిన అనంతరం అక్కడ నిర్మిస్తున్న రామాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు గ్రామ పెద్దల సమక్షంలో మాట్లాడుతూ ప్రముఖ శిల్పులచేత సీతా రామలక్ష్మణులు, హనుమంతుడు, లక్ష్మీ గణపతి విగ్రహాలను సుందరంగా తయారు చేయించి అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు లోవ అప్పారావు, మాజీ సర్పంచ్ డప్పు రామోజీ, మాజీ ఉపసర్పంచ్ కల్లేపల్లి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు గొంతుని శివసంచినాయుడు, పరవాడ కామేశ్వరరావు, ఖాతా రమణ, పరవాడ రమణ, వార్డు మెంబర్ గుర్రాల సత్యారావు, వేగి పవన్ కుమార్ పాల్గొన్నారు.



ముఖద్వారం ప్రారంభంలో పాల్గొన్న సర్పంచ్ సుజాత ముత్యాలు

ఆలయాల ముఖ ద్వారం ప్రారంభం

ప్రజాశక్తి - పరవాడ : మండలంలోని ముత్యాలమ్మపాలెం గ్రామంలో ఆది దేవతలు బంగారమ్మ, భూలోకమ్మ, దుర్గాలమ్మ, కుంచమాంబ, కోర్లమ్మ, మసేను దేవర, ముత్యాలమ్మతల్లి అమ్మవారుల ఆలయాల ముఖ ద్వారాన్ని మంగళవారం ప్రారంభించారు. దిబ్బపాలెం గ్రామ శివారులో ఈ ముఖద్వారాన్ని గ్రామ సర్పంచ్ చింతకాయల సూజాత ముత్యాలు తన తల్లి తండ్రులు చింతకాయల ముత్యాలు అమ్మోరమ్మ జ్ఞాపకార్థం తన సొంత నిధులు 8 లక్షల రూపాయలతో దీనిని నిర్మించారు. మంగళవారం విజయదశమి సందర్భంగా గ్రామంలో అత్యంత వైభవంగా సాము గరివిడి, డప్పులు, తీన్మార్‌లు మధ్య ప్రారంభించారు. ముత్యాలమ్మపాలెం, దిబ్బపాలెం గ్రామ పురవీధులలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గ్రామ పెద్దలను, గ్రామ ప్రముఖులను సన్మానం చేసి బట్టలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో తిక్కవానిపాలెం సర్పంచ్ చేపల మసేను, ముత్యాలమ్మ ఆలయ కమిటీ చైర్మెన్ కూంద్రపు చిన్నంనాయుడు, కోశాధికారి కూంద్రపు శ్రీరామ్మూర్తి, మాజీ ఎంపిటీసి చింతకాయల అమ్మోరు, మండల కోఆప్షన్ సభ్యులు మైలపల్లి అప్పన్న, నాయకులు సూరాడ ముత్యాలరావు, అర్జిల్లి సోములు, చింతకాయల చినముత్యాలు, మైలపల్లి మహేష్, సూరాడ దాసుడు, ఒలిశెట్టి సింహాచలం, తాతారావు పాల్గొన్నారు.

స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-దేవరాపల్లి : వేపాడ మండలం నల్లబెల్లి గ్రామంలో ఇటీవల ప్రమాదవశాత్తు బాణసంచా పేలుడు ప్రమాదంలో మృతి చెందిన గొర్లి కోటయ్య (32) కుటుంబానికి తోటి స్నేహితులు రూ.20వేలు ఆర్థిక సాయం అందించి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. దేవరాపల్లి ప్రభుత్వ పాఠశాలలో 2005-06 సంవత్సరంలో పదవ తరగతి కలిసి చదువుకున్న తోటి మిత్రుడు ప్రమాదంలో మృతి చెందడంతో దేవరాపల్లి, చేనులపాలెంకి చెందిన పూర్వ విద్యార్థులు ముందుకొచ్చి కోటయ్య భార్యకు ఆర్థిక సాయం అందించారు. దీంతోవారిని పలువురు అభినందించారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

టిడిపి నేతల్లో పొత్తు టెన్షన్..

- యలమంచిలి టికెట్ జనసేన పరం కానుందా?
- తెలుగుదేశం, జనసేన పార్టీల పొత్తుపై ఆసక్తికర చర్చ

ప్రజాశక్తి - యలమంచిలి

తెలుగుదేశం - జనసేన పార్టీల పొత్తుపై యలమంచిలి నియోజకవర్గంలో ఆసక్తికర చర్చ మొదలైంది. తెలుగుదేశం నియోజకవర్గం ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు, జనసేన పార్టీ నియోజకవర్గం ఇన్‌ఛార్జి సుందరపు విజయ్‌కుమార్ ఇద్దరూ గతంలో ఎన్నికల్లో భంగపడ్డ వారే. శాసనసభకు ఒక సారి పోటీచేసి పరాజయం పాలైన అనుభవం ఇద్దరికీ ఉంది. అలాగే వైసిపి టికెట్ ఆశించి రాకపోవడంతో తెలుగుదేశంలో చేరిన నేత ప్రగడ నాగేశ్వరరావు కాగా, గతంలో 'ప్రజారాజ్యం' పెందుర్తి టికెట్ ఆశించి భంగపడ్డ నేత సుందరపు విజయకుమార్. ఇద్దరూ రానున్న ఎన్నికల్లో పోటీలో ఉండాలని గట్టిగా నిర్ణయించుకున్న వారే. ఈ నేపథ్యంలో తెలుగుదేశం - జననసేన పొత్తుపై వీరిద్దరికి సర్దిచెప్పడం ఇరు పార్టీ పెద్దలకూ తలనొప్పిగా మారే అవకాశం ఉందనడం అతిశయోక్తి కాదు.



ప్రగడ నాగేశ్వరరావు,



సుందరపు విజయకుమార్

ఉత్తరాంధ్ర జనసేనపార్టీ అధికార ప్రతినిధిగా గుర్తింపు ఉన్న నాయకుడు సుందరపు విజయకుమార్. నియోజకవర్గంలో మరే నాయకుడికీ లేని కాపు సామాజిక తరగతి అండదండలు ఎక్కువగా ఉన్న నాయకుడిగా ప్రగడ నాగేశ్వరరావును చెప్పుకోవచ్చు.

2014 ఎన్నికల్లో వైసిపి తరుపున పోటీ చేసిన ప్రగడ నాగేశ్వరరావు, నాడు పంచకర్ల రమేష్‌బాబు (తెలుగుదేశం) చేతిలో 8,375 ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఆ ఎన్నికల్లో ప్రగడకు 72,188 ఓట్లు వచ్చాయి. అంటే పోలింగ్ అయిన ఓట్లలో 40 శాతం అన్నమాట. నెగ్గిన టిడిపి అభ్యర్థికి 43 శాతం వచ్చాయి. ఆ తర్వాత ప్రగడ నాగేశ్వరరావు 2019లో వైసిపి టికెట్ దక్కకపోవడంతో తెలుగుదేశంలో చేరారు. కన్నబాబు రాజుకు వ్యతరేకంగా పనిచేయడం మొదలు పెట్టారు.

2019 ఎన్నికల్లో జనసేన పార్టీ తరుపున తొలిసారి శాసనసభ ఎన్నికల్లో సుందరపు విజయకుమార్ పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో వైసిపికి వచ్చిన మొత్తం ఓట్లు సంఖ్య 71,934 కాగా జనసేన 19,788 ఓట్లు, తెలుగుదేశం 67,788 ఓట్లు సాధించాయి. 2019 ఎన్నికల్లో జనసేన పార్టీ తరపున విజయకుమార్, తెలుగుదేశం ఓట్లను చీల్చడం వల్లనే వైసిపి విజయం సాధించిందని అప్పట్లో తెలుగుతమ్ముళ్లు మథన పడ్డారు. ఆ ఎన్నికల్లో వైసిపి (కన్నబాబురాజు) నెగ్గింది కేవలం 4,146 ఓట్ల మెజారిటీతో మాత్రమే.

ఈ నేపథ్యంలో యలమంచిలి అసెంబ్లీ నియోజకవర్గంలో పొత్తు రాజకీయాలు ఎలా ఉండబోతున్నాయన్నది ఆసక్తిగా మారింది. ప్రగడ నాగేశ్వరరావు రియల్ ఎస్టేట్ నేపథ్యం నుంచి రాజకీయంగా కాంగ్రెస్, వైసిపిల తర్వాత తెలుగుదేశంలోకి వచ్చిన వ్యక్తి. సుందరపు విజయకుమార్ వ్యాపార నేపథ్యంలోంచి ప్రజారాజ్యం, తెలుగుదేశం పార్టీల తర్వాత జనసేనపార్టీ లోకి వచ్చిన వ్యక్తి. పొత్తులో భాగంగా యలమంచిలి నియోజకవర్గం సీటు వీరిద్దరిలో ఎవరికి కేటాయిస్తే మంచి ఫలితం ఉంటుందన్నది ఇరు పార్టీల నాయకులు భేరీజు వేసుకొనే రోజులు సమీపించాయి. పొత్తు కుదిరినా ఎన్నికలు ముందు అంటే 'బి' ఫారం ఇచ్చే సమయంలో మాత్రమే పొత్తు సీటు ప్రకటించే అవకాశం ఉందంటున్నారు. లేకపోతే జనసేన, తెలుగుదేశం అనుయాయుల్లో విభేదాలు చోటుచేసుకొనే ప్రమాదం లేకపోలేదని విశ్లేషకులు భావిస్తున్నారు.

జిల్లా స్థాయి క్రికెట్ పోటీలకు దినేష్‌కుమార్ ఎంపిక

ప్రజాశక్తి-అనకాపల్లి

పట్టణంలోని ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియంలో ఈ నెల 14న జరిగిన అండర్ -17 క్రికెట్ పోటీల్లో దినేష్ కుమార్ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు కోచ్ ఆడారి సతీష్ కుమార్ మంగళవారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన 280 మంది విద్యార్థులకు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో అనకాపల్లి పట్టణంలోని తాకాశివీధికి చెందిన వియ్యపు దినేష్ కుమార్ ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. దినేష్‌కుమార్ ఎంపిక పట్ల ఎసిఎఫ్ కార్యదర్శి బొండా నాగేశ్వరరావు, పీఈటీ ఎస్వి నరసింహం, వీరునాయుడు అభినందించారు.



ఎంపికైన జట్టులో దినేష్‌కుమార్

ఘనంగా దసరా ఉత్సవాలు



దుర్గమ్మకు పూజలు చేస్తున్న ఎంవిఆర్ కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి గవరపాలెం శతకం పట్టు వద్ద గల కనకదుర్గ అమ్మవారి ఆలయంలో దసరా ఉత్సవాలు సందర్భంగా అమ్మవారి కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. భవాని మాల ధారణ భక్తులకు మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ ఆర్థిక సహకారంతో అన్న సమారాధన నిర్వహించారు. ముగింపు సందర్భంగా పట్టణంలో ప్రధాన జంక్షన్ వద్ద భారీ విద్యుత్ లైటింగ్ కటౌట్లు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయం వ్యవస్థాపకులు పివి రమణ, ఆలయ నిర్వాహకులు కాంద్రేగుల నాయుడు, చైర్మన్ కర్రి సన్యాసినాయుడు, నూకంబిక దేవస్థానం చైర్మన్ కొణతాల మురళీకృష్ణ పాల్గొన్నారు.

వేల్పుల వీధిలోని దేవి ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన అమ్మవారిని వైసిపి అనకాపల్లి పార్లమెంటరీ వరిశీలకులు దాడి రత్నాకర్ దర్శించుకున్నారు. కమిటీ సభ్యులు ఆయన్ని సత్కరించారు.

స్థానిక సత్యనారాయణపురం కళ్యాణగిరి కొండపై ఉన్న దుర్గమ్మ అమ్మవారి సన్నిధిలో మంగళవారం ముత్యాల వెంకటేశ్వరరావు కుటుంబ సమేతంగా అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంవిఆర్ యువసేన సభ్యులు, దుర్గమ్మ భక్తులు, పాల్గొన్నారు.

దేవరాపల్లి : విజయదశమి పండుగను పురస్కరించుకొని మండలంలోని దేవరాపల్లి, రైవాడ, నాగయ్యపేట, సీతంపేట, బోయల కింతాడ తదితర గ్రామాల్లో దుర్గమ్మ మండపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే వాహనాలు, యంత్రాలను శుభ్రం చేసుకుని పూజలు చేశారు. మండల కేంద్రంలో స్టార్ బాయ్స్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి దుర్గమ్మ అనుపు మహోత్సవం ఘనంగా జరిగింది.

ఘనంగా శూలాల ఉత్సవాలు

అచ్యుతాపురం : దసరా నవరాత్రుల సందర్భంగా మండలంలోని హరిపాలెం, అందలపల్లి, తిమ్మరాజుపేట తదితర గ్రామాలలో సోమ, మంగళవారం రెండు రోజులు పాటు శూలాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. హరిపాలెం గ్రామాలలో సుమారు 100 మంది శూలాలు ధరించారు. తిమ్మరాజుపేటలో శూలాలు, నేల వేశాలతో అమ్మవారి అనుపు కార్యక్రమాన్ని ఘనంగా చేశారు. అందరాపల్లి కొండపై అగ్నిగుండం తొక్కి భక్తులు కొండపై నున్న భగీరథి అమ్మవారిని దర్శించుకున్నారు. తిమ్మరాజుపేట గ్రామంలో జగ్గారావు మిత్రమండలి ఆధ్వర్యంలో దుర్గాంబిక ఆలయ ఆవరణలో నేలవేశాలతో అగ్నిగుండ ప్రవేశాన్ని చేశారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

నక్కపల్లి : మండలంలోని దుర్గాదేవి ఆలయాలు మంగళవారం భక్తుల రద్దీతో కిటకిటలాడాయి విజయదశమి పురస్కరించుకొని పలు గ్రామాల్లో దుర్గాదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఉపమాక, కాగిత, ఎన్ నర్సాపురం, చినదొడ్డిగల్లు, ఉద్దండపురం తదితర గ్రామాల్లో దుర్గాదేవి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. పలు గ్రామాల్లో అన్నసమారాధన నిర్వహించారు.

ఉక్రెయిన్ మహిళ ప్రత్యేక పూజలు

ఉపమాక వెంకన్నను ఉక్రెయిన్ మహిళ దర్శించుకున్నారు. ఉక్రెయిన్‌లో యుద్ధ వాతావరణం నెలకొనడంతో అక్కడి నుంచి ముంబై వచ్చి అద్దె ఇంట్లో ఉంటూ దేశంలోని అన్ని ఆలయాలను సందర్శించి, అక్కడ శాంతి నెలకొనాలని పూజలు చేస్తున్నారు. ఈ మేరకు ఉపమాకలో గరుడాద్రి పర్వతంపై వెంకన్నను దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు కృష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు .

వెంకన్న ఆలయంలో ఘనంగా శమీ పూజ

ఉపమాక వెంకన్నఆలయంలో మంగళవారం సాయంత్రం శమీ పూజను ఘనంగా నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామిని పుణ్యకోటి వాహనంపై అధిష్టింపజేసి బంధుర సరస్సు వద్ద లంక వారి మండపం వరకు తిరువీధి సేవ నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం ప్రధాన అర్చకుడు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు, అర్చకులు పాల్గొన్నారు

వైభవంగా దుర్గాదేవి పూజలు

ప్రజాశక్తి -గాజువాక : పెదగంట్యాడ హార్టికల్చర్ సొసైటీ ఆధ్వర్యాన స్టీల్‌ప్లాంట్‌లో దుర్గాదేవి ప్రత్యేక పూజలు జరిపారు. సివిల్ డిజిఎం వి.భాస్కరరావు, సీనియర్ ఇంజినీర్ రాజా రామ్మోహన్‌రావు, పెదగంట్యాడ హార్టికల్చర్ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న డిజిఎం తదితరులు

పందూరు వంతెన పూర్తయ్యేదెన్నడో..?



నీటిలో దిగి, నది దాటి వెళుతున్న విద్యార్థులు

- నాలుగేళ్లుగా నిలిచిన నిర్మాణ పనులు
- నదిలో దిగి రాకపోకలకు నానా అవస్థలు
- 'గడప' దాటని ఎమ్మెల్యే బాబూరావు హామీ
- ఆందోళన, ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

ప్రజాశక్తి-కోటవురట్ల: పందూరు వంతెన నిర్మాణం ఎక్కడ గొంగళి అక్కడే అన్నట్లుందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. వైసిపి ప్రభుత్వం అధికార గడువు మరో ఐదారు నెలల్లోనే పూర్తయిపోయే పరిస్థితి ఉన్నా, గడచిన నాలుగున్నరేళ్లలో ఈ వంతెన నిర్మాణ పనుల్లో ఇసుమంతైనా పురోగతి లేదని ప్రజలు మండిపడుతున్నారు. దీంతో విద్యార్థులు, వృద్ధులు ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. పందూరు నుంచి వివిధ ప్రాంతాలకు పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ప్రయాణికులు నది దాటి వెళ్లాల్సిన పరిస్థితి ఉంది.ప్రభుత్వం వచ్చిన తొలినాళ్లలో రూ.6 కోట్లతో నిర్మాణం మొదలుపెట్టారు అది ప్రస్తుతం పిల్లర్ల స్థాయిలోనే అసంపూర్తిగా నిలిచిపోయింది. నాలుగేళ్లకు పైగా పనుల్లో కదలిక లేకున్నా ప్రభుత్వం, అధికార యంత్రాంగం కనీస చర్యలు చేపట్టలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వంతెన లేని పరిస్థితుల్లో నదిలో నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. ప్రస్తుతం నదిలో నీటిమట్టం బాగా తక్కువగా ఉండడంతో నదినీటిలో దిగి రాకపోకలు సాగిస్తున్నారు. వంతెన నిర్మాణ సమయంలో వేసిన డైవర్షన్ రోడ్డు కూడా కొట్టుకుపోవడంతో అక్కడ ఉన్న రాళ్ల రప్పలుమీదుగా దాటుతూ ప్రస్తుతం రాకపోకలు సాగిస్తున్నారు. అయితే వర్షాల సీజన్‌లో ఏ క్షణాన నది పొంగుతుందో, ఎక్కడ నుంచి ఎటువంటి ప్రమాదాలు ముంచుకొస్తాయోనన్న ఆందోళన ఉంది. అదీగాక నీటిలోదిగి, కాలినడకన నది దాటాల్సిన పరిస్థితుల్లో ఒకరిద్దరుగా వెళ్లే పరిస్థితి లేదని స్థానికులు అంటున్నారు. పందూరు వంతెన నిర్మాణంలో అలసత్వంపై ఇటీవల గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే బాబూరావును స్థానికులు నిలదీశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి, నెల రోజుల్లో మంజూరు చేయిస్తానని భరోసానిచ్చారు. అయితే నాలుగు నెలలు పూర్తయినా, ఎమ్మెల్యే హామీ అమలుకు నోచుకోలేదని అంటున్నారు. ఏదైనా కారణాన నదిలోరాకపోకలు నిలిచిపోతే, వాహనదారులు చుట్టూ పది కిలోమీటర్లు తిరిగి ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది, ఈ విషయమై స్థానిక ఇంజనీరింగ్ అధికారిని కుమార్‌రాజాను వివరణ కోరగా గత ప్రభుత్వం రూ.6 కోట్లు ఖర్చుతో నిర్మాణం చేపట్టగా అది అసంపూర్తిగా నిలిచిపోయిందన్నారు. పిల్లర్ల స్థాయిలో ఉన్న వంతెన నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు రూ. 5.60 కోట్లతో ప్రతిపాదనలు పంపామని, మంజూరు కావాల్సి ఉందని తెలిపారు.

ఎస్ఐగా సురేష్



ఎస్ఐ సురేష్

ప్రజాశక్తి - రోలుగుంట : రోలుగుంట నూతన ఎస్ఐగా సురేష్ ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. సబ్బవరం పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. బాధ్యతల స్వీకరణ తర్వాత శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ సురేష్ మాట్లాడుతూ పోలీసులు, ప్రజల సహకారంతో మండలంలోని అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. గంజాయి, నాటుసారా, జూదం వంటి వాటిపై దృష్టి సారిస్తానన్నారు.

శారదాపీఠంలో సిఎస్ జవహర్‌రెడ్డి

ప్రజాశక్తి-పెందుర్తి : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి విజయదశమి రోజున విశాఖ శారదాపీఠాన్ని సందర్శించారు. పీఠాధిపతులు స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్ర స్వాములను కలిసి ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం రాజశ్యామల అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవంలో పాల్గొన్నారు. రాజశ్యామల ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శమీ వృక్షం చుట్టూ ప్రదక్షిణ చేశారు.

పోటెత్తిన సందర్శకులు



బొర్రా గుహల సందర్శనకు భారీగా వచ్చిన పర్యాటకులు

ప్రజాశక్తి -అనంతగిరి : పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలకు వరుస దసరా సెలవులు కావడంతో మన్యంలోని పర్యాటక ప్రాంతాల్లో సందర్శకులతో సందడి నెలకొంది. మంగళవారం దసరా రోజు కావడంతో బొర్రా గుహలను స్వదేశీ, విదేశీ పర్యాటకులు వేలాది మంది సందర్శించారు. మన్యానికి పర్యాటకులల తాకిడితో మలుపులతో కూడిన అనంతగిరి ఘాట్‌రోడ్డు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పర్యాటకుల వాహనాలు గంటల తరబడి నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది. దీన్ని తమకు అనుకూలంగా మలుచుకున్న సందర్శకులు, ఘాట్‌రోడ్డు మార్గమధ్యలోనే వాహనాలను నిలిపేసి, ప్రకృతి అందాల నడుమ వనభోజనాల తంతును నిర్వహించారు. బొర్రా, కటికి, తాడిగూడ జలపాతాలతో పాటు అనంతగిరికాఫీ ప్లాంటేషన్, డముకు, సుంకరమెట్ట వ్యూపాయింట్ల వద్ద సందర్శకుల సందడి నెలకొంది. మంగళవారంతో సెలవు రోజులు ముగియనుండడంతో ఏజెన్సీలోని పర్యాటక ప్రాంతాలన్నీ జనాలతో కిటకిటలాడాయి.

కరువు కష్టాలు ప్రభుత్వానికి పట్టవా?

- రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలరాజు
- ఎండిపోతున్న వరిపైర్లను రైతులతో కలిసి పరిశీలన

ప్రజాశక్తి -నక్కపల్లి : వర్షాభావ పరిస్థితులతో కరువు విలయతాండవం చేస్తుంటే ఇంతవరకు ప్రభుత్వం, అధికారయంత్రాంగం స్పందించకపోవడం దారుణమని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం అప్పలరాజు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మండలంలోని వేంపాడులో రైతులతో కలిసి ఎండుతున్న వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాభావ ప్రభావంతో మండలంలో ఐదువేల ఎకరాలకు పైగా వరి సాగు చేయాల్సిన పరిస్థితుల్లో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో కేవలం 1200 ఎకరాల్లో మాత్రమే రైతులు నాట్లు వేశారన్నారు. వర్షాలు ముఖం చాటేయడంతో, వేసిన వరినాట్లు కూడా ఎండుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తారు .రైతులు పెట్టుబడులు పెట్టి తీవ్రంగా నష్టపోయారన్నారు. వరి నాట్లు పడక 3800 ఎకరాలు బీడు భూములుగా దర్శనమిస్తున్నాయన్నారు.

వర్షాలు కురవక పోవడంతో చెరువులు, కాలువల్లో చుక్క సాగునీరు కనిపించలేదన్నారు. పశువులు దాహార్తిని తీర్చుకోడానికి కూడా చుక్కనీరు కనిపించ లేదన్నారు. ఇంతటి దారుణమైన పరిస్థితులు మునుపెన్నడూ చూడలేదని రైతులు ఆవేదన చెందుతున్నారన్నారు. వేలాది రూపాయలు అప్పులు చేసి, సాగుకు పెట్టుబడులు పెట్టి, ఆశావహదృక్పథంతో వరి నాట్లు వేస్తే, వర్షాలు లేక కళ్ళెదుటే ఎండిపోతుంటే నష్టపోయిన రైతుల కన్నీరు ప్రభుత్వానికి కనిపించలేదాయని ప్రశ్నించారు.

ప్రస్తుత ఖరీఫ్‌లో నెలకొన్న కరువు, దుర్భిక్ష పరిస్థితులపై స్థానిక ఎమ్మెల్యేగానీ, జిల్లాకలెక్టర్ కానీ స్పందించడంలేదని ఆవేదన వెలబుచ్చారు. ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా వెంటనే నక్కపల్లి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతులు పరిస్థితే ఇలా ఉంటే ఇక వ్యవసాయ కార్మికులు మరింత దయనీయమైన పరిస్థితిలో ఉన్నారని, కూలీలను ఆదుకునేందుకు వెంటనే జాతీయ గ్రామీణ ఉపాధి పనులు ప్రారంభించి రైతులను, కూలీలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బి.రాము, ఎ.అప్పలరాజు, ఎ.అప్పారావు, ఎ.తాతారావు పాల్గొన్నారు.



రైతులతో కలిసి ఎండిపోయిన వరిపైర్లను పరిశీలిస్తున్న అప్పలరాజు

గుబాళిస్తున్న కాఫీ పరిమళం

- మన్యంలో ఆశాజనకంగా దిగుబడి
- పళ్ల సేకరణ ప్రారంభించిన గిరి రైతులు
- ధర ప్రకటనలో జాప్యంతో తప్పని నష్టం



మొక్కకు గుత్తులుగా కాసిన కాఫీ పండ్లు

ప్రజాశక్తి-పాడేరు: మన్యంలో కాఫీ పండ్ల పరిమళం గుబాళిస్తోంది. పాడేరు ఏజెన్సీలోని 11 మండలాల పరిధిలో గిరిజన రైతులు సాగు చేస్తున్న కాఫీ తోటల్లో ఈ ఏడాది కాఫీ దిగుబడి ఆశాజనకంగా ఉంది. సమయానుకూలంగా వర్షాలు కురవడంతో కాఫీ పంట పండిందని గిరిజన రైతులు, ఐటిడిఎ కాఫీ విభాగం కాఫీ అధికారులు చెబుతున్నారు. తోటల్లో చెట్లకు ఎర్రెర్రని గుత్తులతో విరబూసిన కాఫీ పళ్ళు కనువిందు చేస్తున్నాయి. కాఫీ పళ్ళు ఎర్రగా పండి పూర్తిగా పక్వానికి వచ్చి కోతకు సిద్ధమయ్యాయి. గత ఏడాది కంటే ముందుగానే ఈసారి రైతులు తమ తోటల్లో కాఫీ పళ్ళ సేకరణకు ఉపక్రమించారు. ఈ ప్రాంతంలో సోమవారం విజయదశమి నుంచి కాఫీ పళ్ళ సేకరణను ప్రారంభించారు. ఏజెన్సీ 11 మండలాల్లో సుమారు రెండు లక్షల ఎకరాల్లో కాఫీ తోటలు విస్తరించి ఉండగా, కాఫీపండ్లసేకరణ ప్రారంభం కావడంతో ఒకటిరెండురోజుల్లో ముమ్మరం కానున్నాయి.

కొత్త వంగడాల పునరుద్ధరణ

ఏజెన్సీలో ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి సంస్థ (ఎపిఎఫ్‌డిసి) నిర్వహిస్తున్న కాఫీ తోటల పురోగతికి 2014లో ఏర్పడిన హుదూద్ తుఫాన్ ప్రభావంతో గట్టి దెబ్బ తగిలింది. తోటల్లో నీడచెట్లు భారీగా విరిగిపడి, కాఫీ తోటలు పెద్ద ఎత్తున ధ్వంసం అయ్యాయి. అప్పట్నుంచి ఈ ఎపిఎఫ్‌డిసి కాఫీ తోటల్లో దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. 1980-90 మధ్యకాలంలో ఈ ఎపిఎఫ్‌డిసి కాఫీ తోటలు ఏజెన్సీలో విస్తరించాయి. ఇందులో కాఫీ మొక్కలు పాత వెరైటీ లు కావడం మూలంగానూ, ఈ కాఫీ మొక్కల దిగుబడి కాలపరిమితి పూర్తి కావడం వల్ల ప్రస్తుతంకాఫీ దిగుబడి మరింత దిగజారింది. ఈ కాఫీ తోటలను పునరుద్ధరించి పూర్తిగా నవీకరించేందుకు కొత్త వంగడాలతో ప్లాంటేషన్ పనులు చేపడుతున్నారు. ఈ మేరకు వెయ్యి హెక్టార్లలో ఐదేళ్ల నిర్వహణ ప్రణాళిక కింద కొత్త వంగడాలతో ప్లాంటేషన్ పనులు ఈ ఏడాది ప్రారంభించారు.

ధర ప్రకటనపై కాఫీ రైతుల దిగాలు

దిగుబడి బాగున్నా, గిట్టుబాటు ధర లభించకపోవడంతో గిరిజన కాఫీ రైతులకు ప్రయోజనం లేని పరిస్థితి ఉందని వాపోతున్నారు. అపుడే కాఫీ పండ్ల సేకరణ ప్రారంభమైన నేపథ్యంలో, ప్రభుత్వం, అధికార యంత్రాంగం స్పందించి, కాఫీకి మద్దతు ధర ప్రకటించి, ఐటిడిఎ ఆధ్వర్యంలో జిసిసి ద్వారా సత్వరమే కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటన, కొనుగోలులో జాప్యం వల్ల వ్యాపారులు, దళారులు బారిన పడి గిరిజన రైతులు నష్టపోయే పరిస్థితి ఉంది. దీనిపై జిల్లా కలెక్టర్, ప్రభుత్వం, ఐటిడిఎ యంత్రాంగం సత్వర చర్యలు చేపట్టాలని వేడుకుంటున్నారు.

మినీ జలాశయంలో మునిగి యువకుడు మృతి


కోసూరి అరుణ్ (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి -కొత్తకోట : రావికమతం మండలం ధర్మవరం గ్రామ సమీపంలో కామునిగెడ్డ మినీ జలాశయంలో సరదాగా ఈతకు దిగిన యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. కొత్తకోట ఇన్‌ఛార్జి ఎఎస్‌ఐ ప్రసాద్ కథనం మేరకు, కన్నంపేట గ్రామానికి చెందిన కోసూరి అరుణ్ (22) హైదరాబాద్‌లో ఓ ప్రయివేట్ కంపెనీలో చిరుద్యోగం చేస్తూ తన కుటుంబానికి చేదోడుగా ఉంటున్నాడు. దసరా సెలవులకు ఇటీవలే గ్రామానికి వచ్చిన అరుణ్, సోమవారం స్నేహితులతో ధర్మవరం సమీపంలో కామునిగెడ్డ మినీ జలాశయం వద్దకు సరదాగా వెళ్లారు. జలాశయంలో ఈత కొట్టాలన్న సరదాతో స్నేహితులతో దిగాడు అయితే జలాశయంలో ఊబి ఎక్కువగా ఉండటంతో ప్రమాదవశాత్తు నీటిలోమునిగి ఊపిరాడక మృత్యువాత పడ్డాఉ. సహచర మిత్రులు కాపాడేందు ప్రయత్నం చేసినా ఫలితం లేకపోవడంతో కొత్తకోట పోలీసులకు సమాచారం అందజేశారు. మృతిని తండ్రి కోసూరి నాగరాజు ఫిర్యాదు మేరకు ఇన్‌ఛార్జి ఎఎస్‌ఐ ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అంది వచ్చిన కొడుకు, పండగ పూట అర్థాంతరంగా తనువు చాలించడంతో అరుణ్ కుటుంబికులు

వార్డు వెల్ఫేర్ సెక్రటరీ దసరా కానుక

సొంత నిధులతో ప్రజలకు స్వీట్ బాక్స్‌ల పంపిణీ


స్వీట్స్ పంపిణీ చేస్తున్న రమణ

ప్రజాశక్తి-రోలుగుంట : మండలంలోని బుచ్చంపేట గ్రామ పంచాయతీ వార్డు సంక్షేమ అభివృద్ధి కార్యదర్శి అనిమిరెడ్డి రమణ మంగళవారం దసరా పండుగ సందర్భంగా గ్రామస్తులకు స్వీట్స్ పంచారు. మొదటినుంచి సేవా భావంతోనే ముందుకు వెళుతున్న రమణ, దసరాకు తన సొంత నిధులతో 200 మందికి ఒక్కొక్కరికీ ఒకో స్వీట్‌బాక్స్‌ను పంపిణీ చేశారు.

అక్రమంగా తరలిస్తున్న టేకు దుంగలు స్వాధీనం


పోలీసులకు అప్పగించిన టేకు దుంగులు, ట్రాక్టర్

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని పాతమల్లంపేట పంచాయతీ కొత్తపాలెం గ్రామంలో సోమవారం రాత్రి ట్రాక్టర్‌పై తరలిస్తున్న తొమ్మిది టేకు దుంగలను పట్టుకున్నామని గొలుగొండ సెక్షన్ అటవీ అధికారి లక్ష్మణారావు తెలిపారు. టేకు దుంగల తరలింపుపై ముందస్తు సమాచారం రావడంతో గొలుగొండ పోలీసుల సహకారంతో తమ సిబ్బందితో కలిసి దాడులు చేశామన్నారు. పట్టుబడ్డ టేకు దుంగలను గొలుగొండ డిపోకు తరలించామన్నారు. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు.

గృహ ప్రవేశాలకు పరిమితం నివాసాలకు దూరం


నిర్మాణాలు పూర్తయినా తాళాలు వేసిన ఇళ్లు

- జగనన్న కాలనీల్లో లబ్ధిదారుల దుస్థితి
- కనీస వసతులు లేకపోవడం వల్లే ఈ పరిస్థితి
- రహదారి, ఇతర సౌకర్యాలు కరువాయె..

ప్రజాశక్తి -కోటవురట్ల: జగనన్న కాలనీల నిర్మాణాలతో ఊళ్లకుఊళ్లే కట్టిస్తున్నామంటూ రాష్ట్ర ప్రభుత్వం, నేతల మాటలకు, చేతలకు ఎక్కడా పొంతన లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ పెద్దలు, మంత్రుల ప్రకటనలకు, అధికారులు సై అంటూ ఉదరగొడుతున్నారేగానీ, జగనన్న కాలనీలు, లేఅవుట్లు పేరుతో ఏర్పాటుచేసిన ఊళ్లకు కనీసం దారి కల్పించాలని విషయాన్ని మర్చిపోతున్నారు దీంతో ఆయా కాలనీలకు కాలినడకన వెళ్లడానికి కష్టమైన పరిస్థితుల్లో, బిల్డింగ్ మెటీరియల్ తరలించి, ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేయడం ఎంత కష్టమో ఆలోచించాలని అంటున్నారు.దీంతో ఇళ్లు నిర్మించి, గృహప్రవేశాలు చేసినా, కనీస వసతులు లేక అక్కడ నివాసముండలేక, ఇళ్లకు తాళాలు వేసుకునే పరిస్థితి ఉందని లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు.

ప్రభుత్వం ఆదరాబాదరాగా జగనన్న కాలనీ పేర్లతో లేఅవుట్ మంజూరు చేశారు. కానీ లేఅవుట్‌కు వెళ్లే దారి మాత్రం మరిచారు, మండలంలో కోటవురట్ల, పాములవాక గ్రామాలకు ప్రధాన రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. పాములవాక గ్రామంలో ఏర్పాటు చేసిన రెండు లేఅవుట్‌లకు సుమారు 122 లబ్ధిదారులను ఎంపిక చేశారు. పట్టాలమ్మ గుడి వద్ద లేఅవుట్‌లో 80 మంది లబ్ధిదారులు, గ్రామం సమీపంలో ఏర్పాటు చేసిన మరో లేఅవుట్ లో 42 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఈ లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలను అప్పటి రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన కృష్ణదాస్ వచ్చి కాలనీకి శంకుస్థాపన చేశారు. అమాత్యులు వచ్చి ఆర్భాటంగా పనులు ప్రారంభించిన ఈ లేఅవుట్‌కు వెళ్లే దారి లేక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. లబ్ధిదారులు అష్టకష్టాలు పడి ఏలాగోలా నిర్మాణ పనులు చేపట్టడంతో ఆయాకాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు దాదాపు పూర్తి కావస్తున్నాయి.ఇళ్లయితే ఎలాగోలా కష్టబడి కట్టుకున్నా, ఇపుడు ఆయా ఇళ్లకు, కాలనీలకు వెళ్లే దారి లేకపోవడంతో రెండు లేఅవుట్లలోని లబ్ధిదారులు తీవ్ర అసంతృప్తి, అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో అతిపెద్ద లేఅవుట్‌ను మండల కేంద్రంలో పెట్రోల్ బంకు సమీపంలో ఏర్పాటుచేశారు. ఇక్కడ 167 మంది లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించారు. ఈ లేఅవుట్‌లోనూ దాదాపుగా ఇక్కడ నిర్మాణాలు కూడా పూర్తయ్యాయి. అంతేకాదు ఇప్పటికే నిర్మాణాలు పూర్తయిన వారు గృహప్రవేశాలు కూడా చేశారు. అయినా ఈ లేఅవుట్ పరిస్థితి కూడా ఏమంతా మెరుగ్గా లేదు.ఆయా లేఅవుట్లలో కనీస వసతులు లేకపోవడంతో గృహప్రవేశం చేసినా, అక్కడ లబ్ధిదారులు నివాసముండే పరిస్థితి లేదు. ఇళ్లకు తాళాలు వేసి వెళ్లిపోయారు,. కాలనీకి వెళ్లేందుకు ప్రధాన రహదారి మాత్రమే కాదు వీధి రోడ్లు, కాలువలు ఏర్పాటు చేయలేదు. నీటి సౌకర్యం కోసం వాటర్ ట్యాంకులు నిర్మించాల్సి ఉన్నా, ఆ ఊసే మరిచారు, విద్యుత్ సౌకర్యం కూడా అంతంత మాత్రమే. దీంతో కాలనీవాసులు ప్రధాన రహదారి మాట ఎలా ఉన్నా, వీధి రోడ్లు నిర్మాణమైనా చేపట్టి కాలనీవాసులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. దీనిపై అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోకపోవడంతో ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితుల్లో లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు. అధికారులు, నాయకులు ప్రచార ఆర్భాటాలు మాత్రమే చేస్తున్నారని, జగనన్న కాలనీలు, లేఅవుట్లలో కనీస వసతులు కల్పించలేదని తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.


జగనన్న కాలనీలో అధ్వానంగా వీధి రోడ్లు


పాములవాటు వద్ద కాలనీకి వెళ్లే దారి దుస్థితి

సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాటం

687వ రోజుకు మత్స్యకారుల శాంతియుత దీక్షలు



మత్స్యకారుల దీక్షలకు సంఘీభావంగా సిపిఎం నేత అప్పలరాజు

పజాశక్తి -నక్కపల్లి :మత్స్యకారులకు న్యాయం జరిగే వరకూ పోరాటాన్ని కొనసాగిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు స్పష్టం చేశారు. .హెటిరో కొత్త పైపులైన్‌కు వ్యతిరేకంగా మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత మహాధర్నా మంగళవారం నాటికి 687వ రోజుకు చేరింది. ధర్నాలో పాల్గొన్న అప్పలరాజు మాట్లాడుతూ, దాదాపు రెండేళ్లుగా పైపులైన్‌కు వ్యతిరేకంగా మత్స్యకారులు శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే, సమస్య పరిష్కారానికి ప్రభుత్వం అధికారులు చర్యలు చేపట్టక పోవడం దారుణమన్నారు. సముద్ర తీరాన్ని కలుషితం చేసి మత్స్యకారులను సముద్రానికి దూరం చేయొద్దన్నారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో మత్స్యకారులు వలసలబాట పట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు .కొత్త పైపులైన్ ఏర్పాటు చేస్తే మత్స్యకారుల ఉనికికే ప్రమాదన్నారు. మత్స్యకారుల ఉపాధి జీవన విధానాన్ని దృష్టిలో పెట్టుకుని సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అలాగే హెటిరో కొత్త పైపులైను ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు .సమస్య పరిష్కారం అయ్యేవరకు పోరాటాన్ని కొనసాగిస్తామని మత్స్యకారులు ముక్తకంఠంతో స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు జి.సోమేశ్వరరావు, పి.రమణ, సిహెచ్ సోమేష్, ఎం.నరేష్, కె.భూలోక, ఎం.బాపూజీ, కె.కాశీ, శ్రీను పాల్గొన్నారు.

ఆకాశానికేసి అన్నదాత చూపులు

వర్షాభావంతో కొనవాడిపోతున్న పైర్లు


ఎండిపోతున్న వరిపంట

రోలుగుంట : ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతన్నలకు కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. ఆదిలో అడపాదడపా కురిసిన వర్షాలకు, ఆశావహ దృక్పదంతో ఎకరాకు దాదాపు రూ.30వేల వరకు పెట్టుబడులు పెట్టి వరినాట్లు వేశారు.ఆ తర్వాత వర్షాలు పూర్తిగా ఎత్తిపెట్టడంతో ప్రస్తుతం వరిపైర్లకు సాగునీరు అందని పరిస్థితి ఉది. పొట్టదశలో ఉన్న పైర్లకు నీరు అందకపోవడంతో కొనవాడిపోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. కేవలం వర్షాధారంతోనే ఖరీఫ్ వరిసాగు చేస్తున్న మండల రైతాంగం, ఇపుడు వరిపొలాలు బీటలు వారుతూ, పైర్లు ఎండిపోతుండడంతో వర్షాల కోసం ఆకాశానికేసి ఆశగా ఎదురుచూస్తున్నారు.